




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 250 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ సోమవారం 01 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-




## ఎన్నిసార్లు దొరికిపోయినా.. కుట్ర రాజకీయాలు మానరా?

మంత్రి నారా లోకేష్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసమైన ఘటనపై వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగిన మిగతా .. 2లో..



## పూర్తి ఆరోగ్యంగా ట్రంప్

అమెరికా వైద్యుల నిర్ధారణ

**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తి ఆరోగ్యంగా, దేశానికి సేవలందించేందుకు అన్ని విధాల మిగతా .. 2లో..



మా మధ్య అంతర్యుద్ధం

## తీసుకురావాలని చూస్తున్నారు

తెలంగాణ భాజపా చీఫ్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మల్కాజిగిరిలో ఎంపీ ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటంపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు మిగతా .. 2లో..



## ఆమరణ దీక్ష చేస్తా..

నంద్యాలలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసంపై షర్మిల

**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం మిగతా .. 2లో..



# దక్షిణ కోస్తా రైల్వే జోన్

# దశాబ్దాల కల నెరవేరుతోంది

- జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం
- ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మోదీకి, రైల్వే మంత్రికి ధన్యవాదులు
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ జోన్ కీలకం కానుందని సీఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం కేంద్రంగా జూన్ 1 నుంచి దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా ప్రారంభం కావడం చరిత్రాత్మక మైలురాయి అని ఏపీ సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దశాబ్దాల కల నెరవేరుతోందని, నూతన రైల్వే జోన్ ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుందని అభిప్రాయపడ్డారు. కొత్త ఉపాధి అవకాశాలకు, పారిశ్రామికవృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. ఏపీని లాజిస్టిక్స్ హబ్‌గా మార్చేందుకు ఇదొక కీలక మైలురాయి కానుందన్నారు. తమ చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మిగతా .. 2లో..

భోగాపురం విమానాశ్రయానికి

## 50 విద్యుత్తు బస్సులు

మంత్రి రామ్‌ప్రసాద్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి త్వరలో 50 విద్యుత్తు బస్సులను నడపనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. విశాఖలోని కొమ్మాది శాప్ క్రీడామైదానం వేదికగా క్రీడా అకాడమీలకు సంబంధించిన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విశాఖలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 11 వేల బస్సులు మిగతా .. 2లో..

జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా

# 'సేనా గళం'

- పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ జనసేన కీలక నిర్ణయం
- వ్యక్తిగత తప్పులకు కులాలను ఆపాదించవద్దని స్పష్టం
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీలో సరికొత్త అధ్యాయానికి ఉప ముఖ్యమంత్రి, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారు. సామాజిక సామరస్యం, బాధ్యతాయుత రాజకీయాలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ... ముఖ్యంగా జెన్ జీ యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపించడమే లక్ష్యంగా 'సేనా గళం' అనే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. కుల, మత రాజకీయాలతో సమాజాన్ని విభజించే ధోరణులకు వ్యతిరేకంగా ఈ కమిటీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 'ముల్లును ముల్లుతోనే తీయాలి' అనే పాతకాలపు, బూర్జువా రాజకీయ ధోరణులకు మిగతా .. 2లో..

## అందరూ స్వదేశాలకు వెళ్ళాల్సిన అవసరం లేదు

గ్రీన్ కార్డు దరఖాస్తులపై అమెరికా వివరణ



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్రరాజ్యంలో శాశ్వత నివాస హక్కు కల్పించే గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగోరే వలసదారులందరూ స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని అమెరికా మిగతా .. 2లో..

తిరుమలలో వైభవంగా

## పౌర్ణమి గరుడసేవ



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార మిగతా .. 2లో..

గండిపేట భూ కుంభకోణం..

## బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి

ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు
నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల మిగతా .. 2లో..

సింగపూర్ ఓపెన్ టైటిల్ గెలుచుకున్న

## సాత్విక్ - చిరాగ్

అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
ఫైనల్‌లో ఇండోనేషియా జోడీపై విజయం



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సింగపూర్‌లో చారిత్రక విజయం సాధించడం పట్ల ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..

అమలాపురంలో అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాలకు

## మంత్రి నారాయణ శ్రీకారం

రూ.2.50 కోట్ల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
పరిశుభ్రతే ప్రజారోగ్యానికి మూలం : మంత్రి నారాయణ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పురపాలక సంఘాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆరోగ్య భద్రత కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం అమలాపురం పురపాలక సంఘ పరిధిలో నిర్వహించిన పలు అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా మిగతా .. 2లో..

విద్యా వికాస పునర్నిర్మాణానికి

## నడుం బిగించాం

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల విద్యలో తెలంగాణ పనితీరు గణనీయంగా మెరుగుపడిందని కేంద్ర విద్యాశాఖ.. పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో పేర్కొనడం తమ ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అభివృద్ధికి తొలి కొలమానం విద్య అని చెప్పారు. విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగలదని తాను బలంగా విశ్వసించినట్లు తెలిపారు. ఆ దిశగా ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విద్యాశాఖ బాధ్యతలు స్వయంగా తీసుకుని.. రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యం, ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాలపై బలమైన కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్నిర్మాణానికి నడుం బిగించామన్నారు. తాజా ఫలితాలతో సంతృప్తి పడట్లేదని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మిగతా .. 2లో..

## సెర్ప్‌తో మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘ మహిళకు జీవనోపాధి
జూలై నెలాఖరకు ప్రతి జిల్లాలో 200 మంది మహిళా పారిశ్రామికవేత్తలుండాలి
ఉత్తరాంధ్ర జిల్లాల జీవనోపాధి కార్యక్రమ సమీక్షలో మంత్రి కొండపల్లి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త అన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి విజన్‌కు అనుగుణంగా ప్రతి స్వయం సహాయక సంఘాన్ని ఒక పారిశ్రామిక వేత్త కుటుంబంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మంత్రి పెందుర్తిలోని టిటిడిసి ప్రాంగణంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, డీపీఎంలు, జిల్లా సమాఖ్య సభ్యులతో నిర్వహించిన జీవనోపాధి కార్యక్రమాల సమీక్షలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెర్ప్‌తో స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళల ఆర్థిక సాధికారతే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది సంఘం మహిళలు, 4584 మంది నిపుణులు, 27 వేల మంది వీఓఏలు, 1.5 లక్షల మంది ఈనారీలతో సెర్ఫ్ చాలా బలంగా ఉందని... దీని ద్వారా ఉపాధి కల్పన మరింత విస్తృతం చేస్తామని మంత్రి తెలిపారు. మోడ్రన్ లాండ్రీ యూనిట్లు, మిగతా .. 2లో..

ట్రాక్టర్ నడిపి.. పొలం దున్నిన

## మంత్రి నిమ్మల రామానాయుడు



**పాలకొల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అగర్తిపాలెనికి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత రొయ్యల చెరువులో మేత వేసి.. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొన్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం గోదావరి డెల్టాకు సాగు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులందరూ ముందస్తుగా వరి నాట్లు వేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

(మొదటిపేజీ తరువాయి)

### దక్షిణ కోస్తా రైల్వే జోన్..

## దశాబ్ధల కల నెరవేరుతోంది

పేర్కొన్నారు. నూతన రైల్వే జోన్‌తో ఉత్తరాంధ్ర రవాణా ముఖచిత్రం సమూలంగా మారిపోతుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించబడటంతో పాటు పారిశ్రామిక వృద్ధికి కూడా బాటలు పడతాయని తెలిపారు. రాష్ట్రాన్ని ఒక లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే ప్రభుత్వ లక్ష్యానికి ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఏపీ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు రాష్ట్ర ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రబాబు తన ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**విశాఖ-విజయవాడ మధ్య బుల్లెట్ రైలు : ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కీలక ప్రకటన**

ఆంధ్రప్రదేశ్‌లో రవాణా రంగానికి సంబంధించి ఒక శుభవార్త వెలువడింది. విశాఖపట్నం-విజయవాడ నగరాల మధ్య బుల్లెట్ రైలు (హైస్పీడ్ రైల్) ప్రాజెక్టును తీసుకురానున్నట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ వెల్లడించారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా తనకు ఈ విషయాన్ని తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలిస్తే, ఇరు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. మరోవైపు, దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపటి నుంచి (జూన్ 1) విశాఖపట్నం కేంద్రంగా అధికారిక కార్యకలాపాలు ప్రారంభించనుందని మాధవ్ స్పష్టం చేశారు. ఈ జోన్ సాధన కోసం బీజేపీ సుమారు 30 ఏళ్లుగా పోరాటం చేసిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం విశాఖ-విజయవాడ మధ్య రైలు ప్రయాణానికి 5 నుంచి 6 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే, ఈ 350 కిలోమీటర్ల దూరాన్ని కేవలం గంటన్నరలోనే పూర్తి చేయవచ్చని అంచనా. ఈ రైలును తొలుత గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడపాలని, భవిష్యత్తులో వేగాన్ని మరింత పెంచాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ కారిడార్ విజయవాడ నుంచి ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 'ఫైనల్ లొకేషన్ సర్వే' అనుమతుల కోసం క్షేత్రస్థాయి అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపారు. దేశవ్యాప్తంగా ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో ఏపీ మీదుగా ఇప్పటికే మూడు వెళ్తుండగా, ఇది రాష్ట్రానికి అదనపు ప్రయోజనం చేకూర్చనుంది. దీంతో పాటు విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. ఈ కొత్త ప్రాజెక్టులు ఉత్తరాంధ్రతో పాటు మొత్తం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిస్తాయని భావిస్తున్నారు.

## కుట్ర రాజకీయాలు మానరా?

విషయం తెలిసిందే. దీనిపై ఏపీ మంత్రి, తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ స్పందించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన జమ్ములయ్య.. వైకాపా నేతల అనుచరుడేనని పోలీసులు తేల్చినట్లు చెప్పారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని మండిపడ్డారు. జగన్నాటకాలు చూసి జనం ఛీకొట్టినా.. డ్రామాలు మానట్లేదని అన్నారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.

## పూర్తి ఆరోగ్యంగా ట్రంప్

యోగ్యంగా ఉన్నారని శ్వేతసౌధం వైద్యులు తెలిపారు. వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ఈ నెల 26న ట్రంప్‌నకు 22 మంది నిపుణులు పలు వైద్య పరీక్షలు చేసినట్లు ఆయన అధికారిక వైద్యుడు షాన్ బార్బెల్ శనివారం వెల్లడించారు. వచ్చే నెల 80వ వసంతంలోకి అడుగుపెట్టనున్న ట్రంప్.. 108 కిలోల బరువుతో శారీరకంగా మానసికంగా దృఢంగా ఉన్నారని ఆయన తెలిపారు. ట్రంప్ చేతులపై ఇటీవల మచ్చలు కనిపించిన విషయం తెలిసిందే. అవి తరచూ కరచాలనం చేయడంవల్ల ఏర్పడిన చిన్నపాటి సాఫ్ట్ టిష్యూ ఇరిటేషన్ అని బార్బెల్ పేర్కొన్నారు. దీర్ఘకాల సిరల వ్యాధితో (వీనస్ ఇన్‌సఫీషియెన్సీ) ట్రంప్ బాధపడుతున్నట్లు శ్వేతసౌధం గత ఏడాది తెలిపింది. తాజా పరీక్షల్లోనూ కాళ్ల దిగువ భాగంలో స్వల్పంగా వాపు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అయితే పరిస్థితి మునుపటి కంటే మెరుగ్గా ఉందని పేర్కొన్నారు.

## మా మధ్య అంతర్యుద్ధం తీసుకురావాలని చూస్తున్నారు

స్పందించారు. భాజపా నేతల ఐక్యతను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారని, తమ మధ్య అంతర్యుద్ధం తీసుకురావాలని చూస్తున్నారని అన్నారు. ఫ్లెక్సీలపై డీజీపీ, సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## ఆమరణ దీక్ష చేస్తా..

చేయడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్షకు దిగుతానని కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును ఆమె హెచ్చరించారు. ఈ ఘటనను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నంద్యాలలోని శ్రీనివాస సెంటర్‌లో వైఎస్‌ఆర్ విగ్రహంపై ఓ వ్యక్తి దాడి చేసి ధ్వంసం చేశాడని షర్మిల తెలిపారు. పట్టపగలు ఈ ఘటన జరుగుతుంటే, అక్కడే ఉన్న పోలీసులు నిలువరించకపోవడం హేయమైన చర్య అని ఆమె విమర్శించారు. దాడి చేసిన వ్యక్తికి మానసిక స్థితి బాగోలేదని చెప్పి పోలీసులు చేతులు దులుపుకోవడం సరికాదని అన్నారు. ఇది చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపు ఉందని షర్మిల ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి ఘటనలను చూస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్ విగ్రహాలపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితుడితో పాటు, అతని వెనుక ఉన్న శక్తులెవరో తేల్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పాత విగ్రహం స్థానంలో వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో నంద్యాలలో అదే సెంటర్‌లో తాను ఆమరణ దీక్షకు దిగుతానని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.

## 50 విద్యుత్తు బస్సులు

నడుపుతున్నామని, ఈ క్రమంలో అక్కడక్కడ జరుగుతున్న ప్రమాదాలు తమను కలవరపెడుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు ప్రమాదాలకు కారణాలను విశ్లేషిస్తున్నామని చెప్పారు. ప్రమాదాల నివారణకు ఇప్పటికే 3 గంటల నుంచి 8 గంటల వ్యవధిలో ప్రయాణించే బస్సులకు ఇద్దరు డ్రైవర్లను నియమించినట్లు తెలిపారు. విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సహాయ డ్రైవర్ మృతి చెందిన విషయాన్ని తెలియజేశారు. ఆర్టీసీలోనే కాకుండా గత ఆరు నెలలుగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల ప్రమాదాలనూ విశ్లేషించామని, ఎక్కడైనా ఇద్దరు డ్రైవర్లు లేకపోతే అటువంటి బస్సులను సీజ్ చేస్తామన్నారు. బస్సు ఫిట్‌నెస్‌తో పాటు మానవ తప్పిదాలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఆల్కహాల్ పరీక్షలతో పాటు హైవేలో 100 కిలోమీటర్ల నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణం సాగించే బస్సులను నిలుపుదల చేసి డ్రైవర్లకు నిద్రమత్తు రాకుండా ముఖం కడిగించే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో 11 వేల బస్సులను తనిఖీ చేశామన్నారు. విశాఖకు 200 ఏసీ బస్సులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

### తిరుమలలో వైభవంగా

## పౌర్ణమి గరుడసేవ

భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు ధగధగా మెరిసిపోతున్న గరుడిపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

### జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా

## 'సేనా గళం'

జనసేన చరమగీతం పాడుతుందని తేల్చిచెప్పారు. ఒక కులం వారు విమర్శిస్తే, అదే కులం వారితో బదులిప్పించే పద్ధతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి బూజుపట్టిన విధానాలకు తిలోదకాలిచ్చి, అభ్యుదయ భావాలతో ముందుకు సాగాలన్నదే జనసేన ఉద్దేశమని వివరించారు. సమకాలీన రాజకీయాల్లో కొందరు వ్యక్తులు తాము చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కులం, మతం, ప్రాంతం వంటి సున్నితమైన అంశాల ముసుగు వేసుకుంటున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత తప్పిదాలకు సామాజిక వర్గాలను బాధ్యుల్ని చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, ఈ తరహా రాజకీయాలను నేటి యువత (జెన్-జీ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. 'సేనా గళం' కమిటీ.. రాజ్యాంగ విలువలకు కట్టుబడి, దేశ సమగ్రతకు భంగం కలగకుండా పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా యువత ఆశయాలకు అనుగుణంగా గళం వినిపిస్తుందని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, ఆ వ్యవహారంలోకి కులాలను, మతాలను లాగకూడదనేది జనసేన పార్టీ స్పష్టమైన విధానమని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

## అందరూ స్వదేశాలకు వెళ్ళాల్సిన అవసరం లేదు

స్పష్టం చేసింది. దరఖాస్తు ప్రక్రియ జరుగుతున్న సమయంలో అమెరికాలోనే ఉంటూ వేచిచూడొచ్చని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తాజాగా వెల్లడించింది. దరఖాస్తుదారు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్నదానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది. ఇది ఎప్పటినుంచో అమల్లో ఉన్న నిబంధనే అని పేర్కొంది. ఇమిగ్రేషన్ అధికారులకు ఆ విచక్షణాధికారాన్ని గుర్తుచేయడమే ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాల ఉద్దేశమని, పూర్తిస్థాయిలో విధాన మార్పు కాదని వివరించింది.

### గండిపేట భూ కుంభకోణం..

## బొల్లా బ్రహ్మానాయుడే కీలక వ్యక్తి

సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మానాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మానాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మానాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## సింగపూర్ ఓపెన్ టైటిట్ గెలుచుకున్న సాత్విక్ - చిరాగ్

హర్షం వ్యక్తం చేశారు. కేఎఫ్ఎఫ్ సింగపూర్ బ్యాడ్మింటన్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న ఈ జోడీకి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టిల చారిత్రక విజయం పట్ల గర్వంగా ఉంది. మీ అద్భుతమైన గెలుపు, ఆధిపత్య ప్రదర్శన మీ అంకితభావం, పట్టుదల, నైపుణ్యానికి నిదర్శనం" అని కొనియాడారు. ప్రపంచ వేదికపై మరోసారి భారతదేశాన్ని గర్వపడేలా చేశారని, దేశంలోని లక్షలాది మంది యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా, ఈ విజయంతో ఆంధ్రప్రదేశ్ బిడ్డ అయిన సాత్విక్‌సాయిరాజ్ రాష్ట్రానికి గొప్ప కీర్తిప్రతిష్ఠలు తీసుకువచ్చారని చంద్రబాబు ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ చిరస్మరణీయ విజయం సందర్భంగా ఇద్దరు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, భవిష్యత్తులో వారు మరెన్నో విజయాలు, మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు.

**హర్షం వ్యక్తం చేసిన లోకేష్**

భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలన ప్రదర్శనతో అదరగొట్టారని ఏపీ మంత్రి నారా లోకేష్ కొనియాడారు. కేఎఫ్ఎఫ్ సింగపూర్ ఓపెన్ 2026 పురుషుల డబుల్స్ టైటిల్‌ను ఈ జోడీ కైవసం చేసుకుందని, ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహ్మద్ షోహిబుల్ ఫిక్రీ ద్వయంపై గెలుపొందారని వివరించారు. సుమారు 73 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరులో సాత్విక్-చిరాగ్ 18-21, 21-17, 21-16 తేడాతో విజయం సాధించడం అమోఘం అని లోకేష్ ప్రశంసించారు. తొలి గేమ్ కోల్పోయి వెనుకబడినప్పటికీ, అసాధారణ పోరాట పటిమతో పుంజుకుని మిగిలిన రెండు గేములను గెలుచుకోవడం విశేషం అని, వారి దూకుడైన ఆటతీరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారని తెలిపారు. ఈ విజయంపై భారత జోడీకి అభినందనలు తెలుపుతున్నట్టు ట్వీట్ చేశారు. "73 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ స్వచ్ఛమైన బ్యాడ్మింటన్ డ్రామా. తొలి గేమ్ ఓడిపోయినా, ఆ తర్వాత మన క్రీడాకారులు అద్భుతమైన పట్టుదల ప్రదర్శించారు. ఛాంపియన్లకు నా అభినందనలు" అంటూ వారిని కొనియాడారు.

### అమలాపురంలో అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలకు

## మంత్రి నారాయణ శ్రీకారం

పాల్గొన్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు జి. హరీష్ మాధుర్, శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ప్రముఖ నాయకుడు మెట్ల రమణబాబు తదితరులతో కలిసి మంత్రి ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 2.50 కోట్ల వ్యయంతో ఎర్రవంతెన నుంచి నల్లవంతెన వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి నారాయణ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పనులను అధికారికంగా ప్రారంభించారు. మున్సిపల్ పార్కు వద్ద మే 22 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించారు. ఇందులో భాగంగా కాలువల పూడికతీత పనులను ఆయన స్వయంగా ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో "ఒక కుటుంబానికి ఒక వ్యాపారం" పేరిట మహిళలకు ఉపాధి కల్పించే మహాసంకల్పంతో "మన చాయ్ రాస్తా" సంస్థ రూపొందించిన ప్లాస్టిక్ రహిత, పర్యావరణ అనుకూల బయోడిగ్రేడబుల్ టీ కప్పులను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక మున్సిపల్ డంపింగ్ యార్డును సందర్శించిన మంత్రి, అక్కడ సరికొత్త ప్లాస్మా టెక్నాలజీ ద్వారా తడి, పొడి చెత్తను బూడిదగా మార్చే అత్యాధునిక విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సాంకేతికత పనితీరుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఆర్డీవో జి. మమ్మీ, తహసీల్దార్ దివాకర్, మున్సిపల్ కమిషనర్ వి. నిర్మల్ కుమార్, స్థానిక వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యా వికాస పునర్నిర్మాణానికి

## నడుం బిగించాం

స్కూళ్ల నిర్మాణం పూర్తయి.. భవిష్యత్‌లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో తెలంగాణ స్థానాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతాయన్న విశ్వాసం ఉందన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు ప్రేరణ ఇచ్చాయని సీఎం తెలిపారు.

## సెర్ప్‌తో మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

హెయిర్ సెలూన్లు, కార్పెంట్రీ, బొటిక్ మేనేజ్‌మెంట్ రంగాల్లో శిక్షణ కోసం పైలెట్ ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. సంఘం మహిళలకు సాంకేతిక సాయం, మార్కెట్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పీఎం సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి కల్పనలో బ్యాంకుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న మంత్రి, అర్హులైన మహిళలకు రుణ సదుపాయాలు కల్పించి, 2026 జూన్ నెలాఖరు నాటికి ఒక్కొక్క జిల్లాలో కనీసం 200 మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సమగ్ర బిజినెస్ ప్లాన్ రూపొందించుకోవాలని, కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. పాడి రైతుల కోసం నాణ్యమైన పశు గ్రాసం, సైలేజ్ మేకింగ్ యూనిట్లు మరియు పాలు, పాల ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. అలాగే పీఎంజెజెబివై, పీఎంఎస్‌బివై పథకాల కింద అర్హులైన మహిళలందరికీ బీమా కల్పించాలని సూచించారు.

**5 లక్షల మంది మహిళా వ్యాపారవేత్తలే లక్ష్యం**

గతంలో డిజిటలైజేషన్ ఇబ్బందులు ఉండేవని... ఇప్పుడు డ్వాక్రా మహిళలకు అందుబాటులో ఉండేలా డిజిటలైజేషన్ తీసుకువచ్చామని.. గ్రామీణ మహిళల పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి గారు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని మంత్రి తెలిపారు. త్వరలోనే మన డబ్బులు... మన లెక్కలు అనే ఫోన్ యాప్ డ్వాక్రా మహిళల కోసం తీసుకు వస్తున్నామని.. దీని ద్వారా 85 లక్షల మంది సభ్యులు డ్వాక్రాలో చేసుకున్న అప్పులు, పొదుపు గురించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే 5 లక్షల మంది మహిళలను వ్యాపారస్తులుగా చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి ఉన్నారని.. అందుకు అనుగుణంగానే మన ప్రణాళికలు ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా జిల్లాల జిల్లా సమాఖ్య (జిల్లా సమాఖ్య) పాలకవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. అలాగే గాటోస్ కేఫే, నేటివ్ అరకు కేఫే తదితర జీవనోపాధి భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో కూడా ముఖాముఖి సమావేశమై వారి అనుభవాలు, వ్యాపార విస్తరణ అవకాశాలపై చర్చించారు. అలాగే రాష్ట్రంలోని పీడీ, డీపీఎం, ఏపీఎంలకు 912 ల్యాప్‌ట్యాప్‌లు అందజేసే కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు. సెర్ప్ సీఈఓ కరుణ వాకాటి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో జీవనోపాధి అవకాశాలను స్థానిక వనరులకు అనుగుణంగా విస్తరించాలని, మహిళలకు రుణాలు, మార్కెటింగ్, నైపుణ్యాభివృద్ధి మరియు వ్యాపార నిర్వహణలో పూర్తి స్థాయి సహకారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో లైవ్లీహుడ్స్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, హెచ్‌ఆర్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సముద్ర గర్భ కేబుళ్ల భద్రతకు

## అండర్ వాటర్ డ్రోన్ ప్రాజెక్టు

**ఆకస్ కూటమి నిర్ణయం**

**సింగపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సముద్రగర్భ కేబుళ్లను రక్షించడానికి, రక్షణ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అండర్ వాటర్ డ్రోన్లను అభివృద్ధి చేయాలని ఆకస్ కూటమి (అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా) నిర్ణయించింది. సింగపూర్‌లో జరుగుతున్న భద్రతా సదస్సులో ఈ మూడు దేశాల రక్షణ మంత్రులు శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మానవరహిత వాహనాన్ని వచ్చే ఏడాది నాటికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రాజెక్టు మొత్తం ఖర్చును ప్రకటించనప్పటికీ, బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హీలీ తమ దేశం తరపున 201 మిలియన్ల డాలర్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ అండర్ వాటర్ డ్రోన్లు సముద్ర గర్భంలో కేబుళ్లు, పైప్‌లైన్లను రక్షించడంతోపాటు, నిఘా పెట్టడానికి, సమాచార సేకరణకు, అవసరమైతే దాడులు చేయడానికి ఉపయోగపడతాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనిక శక్తిని అడ్డుకోవడం ప్రధాన లక్ష్యంగా ఆకస్ కూటమి 2021లో ఏర్పడింది.

# ఎడిటర్ వాయిస్

## టీడీపీ సీనియర్లకు అక్కడ చోటు?

తెలుగుదేశం పార్టీలో ఇపుడు యువ సందడి ఎక్కువగా కనిపిస్తోంది. ప్రతీ మహనాడుకూ ఈసారి మహానాడుకు మధ్య తేడా కొట్టొచ్చినట్లుగా కనిపించింది. ఎక్కువగా కొత్త వారితో యువతతో మాట్లాడించారు. వారికే వేదికను ఇచ్చారు. అదే సమయంలో కొంతమంది సీనియర్లను కూడా పిలిచి పెద్ద పీట వేశారు. అయితే వీటిని చూస్తున్నపుడు టీడీపీలో ఒక కీలక మార్పు జరగబోతోంది అని అర్థం అవుతోంది రానున్నది జూనియర్ల యుగం అని కూడా అంతా అవగాహనకు తెచ్చుకుని ఇప్పటికే మానసికంగా కూడా సిద్ధం అయిపోయారు. అయితే టీడీపీలో సీనియర్లకు కూడా సముచిత స్థానం ఉంటుందని చెఉతున్నారు వారి అనుభవాలను సైతం పార్టీ వాడుకుంటుందని అంటున్నారు ఏళ్ళకు ఏళ్ళు ఏకంగా కొన్ని దశాబ్దాల పాటు పార్టీకి సేవ చేసిన సీనియర్ల నుంచి పార్టీ ఎపుడూ సరైన మార్గదర్శకత్వం పొందుతుందని కూడా చెబుతున్నారు.

**గంపగుత్తగా వారికేనా :** ఇదిలా ఉంటే టీడీపీలో పలువురు సీనియర్లను గురించి ప్రత్యేకంగా వారి కోసమే పార్టీ పెద్దల సభలో చోటు కల్పిస్తుందని అంటున్నారు. పెద్దల సభ అంటే శాసన మండలి అన్న మాట. టీడీపీ కూటమికి నిజంగా రాజ్యసభ శాసనమండలిలో అదృష్టమే అని అంటున్నారు అక్కడ ఏ ఒక్క సీటు ఖాళీ అయినా అవి కూటమి పరమే కాబోతున్నాయి. ప్రస్తుతం రాజ్యసభ ఖాళీలు నాలుగు అవుతున్నాయి. కానీ టైట్ పొజిషన్ గానే ఉంది. దాంతో ఇక్కడ సీటు కోసం ప్రయత్నం చేసి విఫలం అయ్యే సీనియర్లు కానీ పార్టీతో తమకు సముచిత స్థానం కోరుకునే వారు కానీ ఎక్కువ మంది ఉన్నారు అలాంటి వారి అందరికీ పార్టీ ఎమ్మెల్సీ స్థానాలలో భర్తీ చేస్తుందని చెబుతున్నారు. ఈసారి పదుల సంఖ్యలోనే సీట్లు ఖాళీ అవుతాయని వాటిలో సింహ భాగం సీనియర్లకే అని ప్రచారం అయితే సాగుతోంది.

**సగం మండలి ఖాళీ :** వచ్చే ఏడాది అంటే 2027 టీడీపీ కూటమికి శాసనమండలిలో చాలా కీలకమైన ఏడాదిగా చెబుతున్నారు. ఎందుకంటే మొత్తం శాసనసభలో 58 సీట్లు ఉంటే అందులో దాదాపుగా సగానికి సగం 23 సీట్లు ఒకేసారి ఖాళీ కాబోతున్నాయి. అలా ఖాళీ అయ్యే సీట్లలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషెన్ రాజు కూడా ఉన్నారు. అలాగే వైసీపీ నుంచి ఎంతో మంది పదవీ విరమణ చేయబోతున్నారు. అలా మండలిలో ఒకేసారి 23 ఖాళీలు అంటే మాటలు కాదు. వాటిని భర్తీ చేసే సువర్ణ అవకాశం టీడీపీ కూటమికే దక్కబోతోంది దాంతో టీడీపీ సీనియర్ నేతలకు ఇక్కడ చోటు కల్పించేందుకు రెడీ అవుతోంది అని అంటున్నారు.

**పెద్దలుగా ఉంటూనే :** ఈ విధంగా ఆరేళ్ళ పాటు ఎమ్మెల్సీ పదవీ కాలం సీనియర్ల అనుభవానికి తగినట్లుగా ఇస్తారు అని అంటున్నారు దాంతో వారు విలువైన సూచనలు సలహాలు మండలిలో ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి మేలు చేసే విధంగా దోహదపడతారు అని అంటున్నారు. ఇలా సీనియర్లను మండలికి సర్దుబాటు చేయడం ద్వారా ఆయా నియోజకవర్గాలలో కొత్త ముఖాలను యువతను ప్రోత్సహించాలని టీడీపీ డిసైడ్ అయింది అని అంటున్నారు. మొత్తం మీద చూసుకుంటే కొత్త నీరు వచ్చి పాత నీరుని నెట్టేయడం కామన్ అయినా టీడీపీ మాత్రం సీనియర్లను గౌరవించాలనే చూస్తోంది అని అంటున్నారు అలా సీనియర్లకు భారీ ఊరట దక్కబోతోంది అని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ముగ్గురి మృతి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** గాజువాకలోని శ్రీనగర్ వద్ద ఇవాళ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. రాజమహేంద్రవరం నుంచి రామభద్రాపురం వైపు వెళ్తోన్న ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఒక డ్రైవర్ మృతిచెందగా, ఏడుగురుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భర్త కళ్ల ముందే భార్య గొంతుకోసి చంపిన దుండగులు

**సంగారెడ్డి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐడీఏ బొల్లారం పరిధిలో దారుణం చోటు చేసుకుంది. భర్త కళ్ల ముందే దుండగులు.. భార్య గొంతుకోసి చంపిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం... బిహార్‌కు చెందిన అనిల్ కుమార్, మీనాదేవి దంపతులు వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి ఐడీఏ బొల్లారం పరిధిలో సంతకువెళ్లారు. ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగివస్తుండగా గండిగూడెం క్రీడాప్రాంగణం వద్దకు రాగానే బైక్ ఆగిపోయింది. ఈ క్రమంలో దుండగులు చెట్ల పొదల్లోంచి వచ్చి భర్తపై దాడి చేసి భార్యను లాక్కెళ్లారు. మీనాదేవి(35) గొంతుకోసి పరారయ్యారు. అడ్డుకోబోయిన భర్తపైనా కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐడీఏ బొల్లారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వరుసగా ఢీకొన్న వాహనాలు..

**ఆరుగురి మృతి.. పలువురికి గాయాలు**



**బెంగళూరు (చిత్రదుర్గం), విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వరుసగా పలు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కబల్లాపుర జిల్లా బాగేపల్లి సమీపంలోని సుంకాలమ్మ దేవాలయం వద్ద ముందు వెళ్తున్న ఆటోని వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపు తప్పి ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జైంది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ అంజినప్ప (33), ప్రయాణికులు ఉమాదేవి (55), విజయమ్మ (40), లక్ష్మమ్మ (50), సరోజమ్మ (43) అక్కడికక్కడే మృతి చెందారు. ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న మరో 10 మందికి గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. చిక్కబల్లాపుర ఎస్పీ కుశాల్ చౌక్సే ప్రమాదస్థలికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌పై తల్లిదండ్రుల వద్దకు వెళ్తుండగా కూలిన భారీ చెట్టు



**ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి.. భార్య, కుమారుడికి గాయాలు**

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రుల వద్దకు ఎంతో ఆనందంగా బయల్దేరిన ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ఓ భారీ చెట్టు కకావికలం చేసింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిపై భారీ వేప చెట్టు కూలడంతో భర్త మృతి చెందగా, భార్య, కుమారుడికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన గుంటూరులో చోటుచేసుకుంది. నగరంలోని నగరంపాలేనికి చెందిన పులిగడ్డ వెంకటసాయికృష్ణప్రసాద్(45) బుడంపాడులోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, భార్య సరిత సీడీజీవోగా పని చేస్తున్నారు. శనివారం ఉదయం ప్రసాద్ తన స్వస్థలం రేపల్లెలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు భార్య, చిన్నకుమారుడు కార్తీక్‌తో కలిసి బైక్‌పై రైల్వేస్టేషన్‌కు బయల్దేరారు. మార్గంమధ్యలో వైద్యకళాశాల దాటిన తర్వాత పాత ఉపాధి కల్పన కార్యాలయం ఎదుట వారిపై ఓ భారీ వేప చెట్టు కూలి పడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. సరిత స్పృహ కోల్పోగా, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన సరిత భర్త మరణ వార్త విని గుండెలవిసేలా రోదించారు. ఆమెను ఆపడం ఎవరితరం కాలేదు. ఆమె కాలికి గాయాలైనప్పటికీ భర్త మృతదేహం వద్దకు పరుగు తీయడం, మరోపక్క కుమారుడి ఆరోగ్య పరిస్థితి వాకబు చేస్తూ తిరుగుతున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

**స్కూటీపై వెళ్తూ సెల్ఫీ..**

## లారీని ఢీకొన్న వాహనం



**విశ్వం వాయిస్ న్యూస్ :** స్కూటీపై సెల్ఫీ తీసుకుంటూ.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన ఘటన అల్లూరి జిల్లా పాడేరులో జరిగింది. ఈ ఘటనలో వాహనంపై ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. చింతలవీధి పెట్రోల్‌బంకు సమీపంలో ఒక మహిళ, ఇద్దరు యువకులు స్కూటీపై వెళ్తుండగా.. వాహనం నడుపుతున్న వ్యక్తి సెల్ఫీ తీసేందుకు యత్నించాడని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పి లారీని ఢీకొన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీకెమెరాల్లో రికార్డయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.

## నాలుగేళ్ల బాలుడు అదృశ్యం..

**తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయిన నాలుగేళ్ల బాలుడిని టప్పాచబుత్రా పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మొహమ్మద్ హంజా (4) మే 30వ తేదీ సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ.. ఆ తర్వాత కనిపించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఘటనా స్థలం, పరిసర ప్రాంతాల్లో సీసీ పుటేజీలను పరిశీలించారు. తస్లీమ్ బేగం అనే మహిళ బాలుడితో కలిసి వెళున్న దృశ్యాలు గుర్తించారు. ఆమెను విచారించగా.. బాలుడు అనుకోకుండా తన వెంట వచ్చాడని, రాత్రి కావడంతో తన వద్దే ఉంచుకుని ఉదయం.. మసీదు ద్వారా ప్రకటన చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని భావించినట్టు పోలీసులకు తెలిపింది. దీంతో బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు వేగంగా స్పందించి బాలుడిని గుర్తించడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నదిలో స్నానానికి వెళ్లి ఐదుగురి గల్లంతు

**ఒకరి మృతదేహం లభ్యం – కర్నూలు జిల్లాలో విషాదం**



**మంత్రాలయం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఐదుగురు తుంగభద్ర నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలో శనివారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మంత్రాలయానికి చెందిన కాళప్పాచారి ఇంట్లో ఆదివారం వ్రతం ఉండటంతో బంధువులు వచ్చారు. వారిలో ఆరుగురు సమీపంలోని తుంగభద్ర నదికి వెళ్లారు. స్నానం చేస్తుండగా యువన్ చంద్ర అనే బాలుడు నీటిలో కొట్టుకుపోతుండగా అతణ్ని కాపాడబోయి ఒకరి తర్వాత ఒకరు నదిలోకి దిగి గల్లంతయ్యారు. అపర్ణ అనే బాలిక ప్రమాదం నుంచి బయటపడింది. గల్లంతైన వారిలో కర్నూలుకు చెందిన యువన్ చంద్ర, వడ్ల సతీష్ చంద్ర, మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర, ఎమ్మిగనూరుకు చెందిన వడ్ల ధను, అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య ఉన్నారు. ఈ విషయంపై అపర్ణ కుటుంబీకుల సాయంతో పోలీసులకు చెప్పడంతో మంత్రాలయం సీఐ దస్తగిరి బాబు, అగ్నిమాపక అధికారులు, మత్స్యకారుల సహకారంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వడ్ల ధను (22) మృతదేహాన్ని వెలికితీశారు. మిగతా నలుగురి కోసం గాలిస్తున్నారు. గాలింపునకు ఆదివారం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రానున్నట్లు పోలీసులు తెలిపారు. గల్లంతైన వారిలో వడ్ల సతీష్ చంద్ర, యువన్ చంద్ర తండ్రీ కుమారులు, మిగతా వారంతా దగ్గరి బంధువులు కావడంతో ఆ ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి.

## పిడుగు ప్రభావానికి మహిళ మృతి

**ఎర్రగుంట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** పిడుగు ప్రభావానికి గురై మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన వైఎస్సార్ కడప జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఎర్రగుంట్ల మండలం చిలమకూరు సమీపంలో శనివారం సాయంత్రం భారీ శబ్దంతో పిడుగు పడింది. ఆ సమయంలో ఇంటి గుమ్మం వద్ద నిల్చొని ఉన్న కొట్టు అంజనమ్మ(42) ఒక్కసారిగా కుప్పకూలిపోగా, ఆమె కుమారుడు మహేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అంజనమ్మను ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహేష్‌ను మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

**గ్యాస్ వినియోగదారులకు బిగ్ అలర్ట్..**

## జూన్ నుంచి కొత్త రూల్స్! వారికి షాక్




దేశవ్యాప్తంగా పీఎన్‌జీ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలు చేస్తోంది. ఇప్పటికే పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న గృహాలు ఎల్‌పీజీ కనెక్షన్‌ను రద్దు చేసుకోవాల్సి రావచ్చు. రీఫిల్ పరిమితులు, లాక్-ఇన్ వ్యవధి పెంపు, కొత్త కనెక్షన్ నిబంధనలు జూన్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దేశంలో పైప్‌డ్ నేచురల్ గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలను వేగవంతం చేస్తోంది. వంటగ్యాస్ వినియోగంలో ఎల్‌పీజీపై ఆధారపడుతున్న కుటుంబాలను క్రమంగా పీఎన్‌జీ వైపు మళ్లించేందుకు కొత్త నిబంధనలను అమలు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో జూన్ నెల నుంచి గ్యాస్ వినియోగదారులపై ప్రభావం చూపే పలు మార్పులు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం జాతీయ పీఎన్‌జీ విస్తరణ కార్యక్రమం కింద లక్షలాది కొత్త కనెక్షన్లు మంజూరైనప్పటికీ, వాస్తవ వినియోగం మాత్రం ఆశించిన స్థాయికి చేరలేదు. మరోవైపు దేశంలో ఎల్‌పీజీ వినియోగదారుల సంఖ్య గత పదేళ్లలో భారీగా పెరిగి 33.5 కోట్లకు చేరుకోగా, పీఎన్‌జీ వినియోగదారులు ఇంకా పరిమితంగానే ఉన్నారు. కొత్త ప్రతిపాదిత నిబంధనల ప్రకారం, ఇప్పటికే పీఎన్‌జీ కనెక్షన్ ఉన్న గృహాలు ఒకేసారి ఎల్‌పీజీ కనెక్షన్‌ను కొనసాగించడంపై ఆంక్షలు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఒకే చిరునామాలో రెండు గ్యాస్ కనెక్షన్లను కలిగి ఉండటాన్ని నియంత్రించేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు డేటాను సమన్వయం చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్‌లపై పరిమితులు విధించే అవకాశముందని తెలుస్తోంది. పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ లాక్-ఇన్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వరకు పెంచే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది. అలాగే సంవత్సరానికి 12 సబ్సిడీ సిలిండర్ల పరిమితి కొనసాగనుండగా, అదనపు సిలిండర్లకు మార్కెట్ ధర వర్తించనుంది. కొత్త ఎల్‌పీజీ కనెక్షన్ తీసుకునే వారు రెగ్యులేటర్, హోస్, ఇన్‌స్టాలేషన్ వంటి ఖర్చులతో కూడిన సవరించిన డిపాజిట్ చెల్లించాల్సి రావచ్చు. పీఎన్‌జీ వినియోగం పెరగడం వల్ల సురక్షితమైన, నిరంతర గ్యాస్ సరఫరా సాధ్యమవుతుంది. అయితే వినియోగదారులకు తగిన అవగాహన, మౌలిక వసతుల విస్తరణ లేకుండా ఈ మార్పు పూర్తిస్థాయిలో విజయవంతం కావడం సవాలుగా మారవచ్చని వారు చెబుతున్నారు. జూన్ 30 వరకు కొనసాగనున్న PNG డ్రైవ్ 2.0 ఈ మార్పులకు కీలకంగా మారే అవకాశం ఉంది.

**తులం బంగారంపై రూ.20 వేలు, వెండిపై రూ.1.23 లక్షలు తగ్గింపు..**

## 10 గ్రాముల ధర ఎంతంటే..?






దేశంలో బంగారం, వెండి ధరలు హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతున్నాయి. అయితే గతంలో ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం భారీగా తగ్గాయనే చెప్పాలి. తులం బంగారంపై ఏకంగా 20 వేల వరకు తగ్గుదలను చూడవచ్చు.. గత రెండు నెలలుగా బంగారం, వెండి ధరలలో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటున్నాయి. బంగారం, వెండి ధరలలో కొనసాగుతున్న భారీ తగ్గుదల ఆగడం లేదు. సర్వకాలిక గరిష్ఠ స్థాయి (అత్యధిక స్థాయి)తో పోల్చి చూస్తే, బంగారం ధర దాని గరిష్ట ధర నుంచి సుమారు రూ.20,000 మేర తగ్గగా, వెండి ధర ఏకంగా రూ.1.23 లక్షల మేర పడిపోయిందనే చెప్పాలి. గతంలో ఉన్న ధరలను పోలిస్తే అసలు లెక్కలు తేలుస్తాయి. ప్రపంచ అస్థిరత మధ్య అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సుకు 4,516 డాలర్లకు చేరువ కాగా, వెండి ధర ఔన్సుకు 76 డాలర్లకు చేరువయ్యింది. ‘ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్’ వెబ్‌సైట్‌లో ప్రచురించిన తాజా ధరల జాబితా ప్రకారం.. 24 క్యారెట్ల నుండి 18 క్యారెట్ల బంగారం ధరలు ఈ రోజు ఈ కింది విధంగా ఉన్నాయి. మరోవైపు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ధర రూ.926 తగ్గి రూ.1,56,000కి చేరింది. తాజాగా బంగారం ధరలు (10 గ్రాములకు): 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,56,463 రూపాయలు, 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,43,320 రూపాయలు, 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,17,347 రూపాయల వద్ద కొనసాగుతున్నాయి.

**బంగారం, వెండి ధరలు ఎంత చౌకగా మారాయి?:** గత రికార్డును పరిశీలిస్తే, 2025 డిసెంబర్ 31న బంగారం ధర 1.33 లక్షలుగా ఉండగా, అది 2026 జనవరి 29న అత్యధిక స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో 10 గ్రాముల బంగారం 1.76 లక్షల వద్ద ట్రేడ్ అవుతోంది. ఈ అత్యధిక ధరతో పోలిస్తే ఇప్పటివరకు బంగారం ధర 20,000 రూపాయలు చౌకగా మారింది. మరోవైపు జనవరి 29న కిలో వెండి ధర 3.86 లక్షల చారిత్రాత్మక గరిష్ఠ స్థాయికి చేరుకోగా, అది ఇప్పుడు కిలోకు 2.63 లక్షలకు తగ్గింది. అంటే గత 118 రోజుల్లో వెండి ధరలో 1.23 లక్షల భారీ తగ్గుదల నమోదైంది. అయితే ప్రస్తుతం పెరుగుతూ తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు.. గతంలో ఉన్న ధరలతో పోలిస్తే భారీగా తగ్గుముఖం పట్టాయనే చెప్పాలి.

విశ్వం వాయిస్ ఇంపాక్ట్!

# 24 గంటల్లో కదిలిన యంత్రాంగం.. 'లోటస్ అపార్ట్‌మెంట్' రోడ్డు క్లీన్!

ముందు-తరువాత



నాడు - అధ్వాన్నపు దృశ్యం (<IMAGE> లో వలె)



నేడు - స్వచ్ఛమైన దృశ్యం (24 గంటల్లో క్లీన్)

పారిశుధ్య పనులు (JCB & కార్మికులు)

**బాక్స్ ఐటమ్**

**ఎంపీడీవో బి. చిన్నారావు హామీ నెరవేర్చారు!**



కథనానికి తక్షణమే స్పందించి, హామీ నిలబెట్టుకున్నారు. స్థానికుల హర్షం.

**'విశ్వం వాయిస్' నిరూపించింది:** సమస్యలను వెలికితీయడమే కాదు.. పరిష్కారం వరకు బాధ్యత.

**ఊపిరి పీల్చుకున్న నివాసితులు:** 'లోటస్ అపార్ట్‌మెంట్' రోడ్డు అద్దంలా మెరిసిపోతోంది.

**యుద్ధప్రాతిపదికన పనులు:** జేసీబీ, ట్రాక్టర్లతో రంగంలోకి దిగిన పంచాయతీ సిబ్బంది.

**స్థానికుల కృతజ్ఞతలు:** హామీ నిలబెట్టుకున్న ఎంపీడీవో బి. చిన్నారావుకు ధన్యవాదాలు.






- పూడిమడక రోడ్డు ఇండియన్ ఆయిల్ బంక్ వెనుక తొలగిన చెత్త కుప్పలు
- పత్రికా కథనానికి తక్షణమే స్పందించి హామీ నిలబెట్టుకున్న ఎంపీడీవో బి.చిన్నారావు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**అచ్యుతాపురం, విశ్వం వాయిస్ ప్రతినిధి న్యూస్ :** సమస్యలను వెలికితీయడమే కాదు.. వాటి పరిష్కారం వరకు బాధ్యతగా పనిచేస్తుందని 'విశ్వం వాయిస్' మరోసారి నిరూపించింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం నియోజకవర్గం/మండల కేంద్రంలోని పూడిమడక రోడ్డు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక వైపు గల లిలోటస్ అపార్ట్‌మెంట్‌లి ప్రధాన రహదారి మార్గంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, అధ్వాన్నపు చెత్త కుప్పలపై బుధవారం నాటి సంచికలో ప్రచురించిన ప్రత్యేక బ్యానర్ కథనానికి అధికార యంత్రాంగం తక్షణమే స్పందించింది.

**మారిన దృశ్యం.. స్వచ్ఛంగా మారిన రహదారి! యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు**

పత్రికలో వచ్చిన కథనంపై అచ్యుతాపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. చిన్నారావు వెంటనే స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ అధికారులు, పారిశుధ్య సిబ్బంది జేసీబీ, ట్రాక్టర్లతో రంగంలోకి దిగి లోటస్ అపార్ట్‌మెంట్ మార్గంలో కొండలా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, మురికి కూపాలను పూర్తిగా తొలగించారు. రోడ్డుపై పడిపోయిన నీలి రంగు డ్రమ్ములను సైతం క్రమపద్ధతిలో అమర్చారు. ఊపిరి పీల్చుకున్న లోటస్ అపార్ట్‌మెంట్ నివాసితులు అపార్ట్‌మెంట్ బ్లాక్-ఎకి వెళ్లే ఈ



అచ్యుతాపురం 'లోటస్ అపార్ట్‌మెంట్' రోడ్డులో నరకం!

పూడిమడక రోడ్డు ఇండియన్ ఆయిల్ బంక్ వెనుక వెలిసిన ప్లాస్టిక్, మురికి సామ్రాజ్యం

పారిశ్రామిక హబ్‌లో పడకేసిన పారిశుధ్యం.. అంటువ్యాధుల గురవుతున్న నివాసితులు.. అధికారులు స్పందించరా?

ప్రధాన రహదారి మార్గం ఇప్పుడు పూర్తిగా అద్దంలా మెరిసిపోతోంది. నిన్నటి వరకు ముక్కు మూసుకుని ప్రయాణించిన రోడ్డు నేడు చెత్త రహితంగా మారడంతో స్థానిక నివాసితులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**హామీ నిలబెట్టుకున్న ఎంపీడీవోకు ధన్యవాదాలు**

బ్రిడ్జి పనుల వల్ల కార్మికులకు ఇబ్బంది ఎదురైనప్పటికీ, సమస్యను మా దృష్టికి తీసుకురాగానే ప్రత్యేక చొరవ చూపి, ఇచ్చిన హామీ ప్రకారం 24 గంటల్లోనే పారిశుధ్య పనులను పూర్తి చేయించిన ఎంపీడీవో బి.చిన్నారావుకి, క్షేత్రస్థాయిలో పనిచేసిన పంచాయతీ సిబ్బందికి లోటస్ అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు మరియు చుట్టుపక్కల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై 'విశ్వం వాయిస్' చూపిన చొరవను, అధికారుల తక్షణ స్పందనను మండల వ్యాప్తంగా ప్రజలు అభినందిస్తున్నారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కారానికి 'విశ్వం వాయిస్' ఎల్లప్పుడూ ముందుంటుంది!

# పల్ల వెంకన్న ట్రస్ట్‌చే చిత్రలేఖన పోటీలు

**పర్యావరణ పరిరక్షణకు అందరం కృషి చేద్దాం : పల్ల సుబ్రహ్మణ్యం**






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పల్ల వెంకన్న ట్రస్ట్ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. జూన్ 5న తన తండ్రి పల్ల వెంకన్న 90వ జయంతి మరియు పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పర్యావరణం పట్ల ఆసక్తి, బాధ్యతను పెంచాలి అన్న ఉద్దేశ్యం తో స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే "భావితరం పౌరులమైన మేము పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత మాదేనని ప్రతిజ్ఞ చేయించారు.ముందుగా పల్ల వెంకన్న చిత్రపటానికి పల్ల సుబ్రహ్మణ్యం, వెంకటేష్, వ్యాఖ్యాత గొల్లపల్లి సత్యనారాయణ, న్యాయ నిర్ణేతలు పుష్పమాలతో శ్రద్ధాంజలి ఘటించారు.పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తన తండ్రి వెంకన్న జీవితం ఎందరికో స్ఫూర్తి అని, ఎకరం భూమితో నర్సరీని ప్రారంభించి, వంద ఎకరాల నర్సరీగా వృద్ధి చేయడం వెనుక వారి కృషి అనన్య సామాన్యం అని, వైకల్యాన్ని జయించిన మహనీయుడని అన్నారు. నేటి తరం విద్యార్థులు చిన్నపాటి కష్టానికే కృంగిపోవడం,మార్కులు తగ్గితే జీవితం ముగిసిపోయిందని బాధపడటం తగదు అన్నారు. నిర్వాహకులు పల్ల వెంకటేష్ మాట్లాడుతూ నేడు నిర్వహించిన పోటీలు మూడు విభాగాల్లోనూ 65 మంది విద్యార్థులు పాల్గొన్నారని, జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం మరియు పల్ల వెంకన్న జయంతి సందర్భంగా కడియపులంకలో జరిగే కార్యక్రమం లో విజేతలకు వ్యాసరచన, వక్రత్వం - ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు 4వేలు, 2500, 2వేలు, చిత్రలేఖనం విభాగంలో 2500, 1500, 1000 రూపాయలు నగదు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, అందచేసి సత్కారం చేయనున్నారన్నారు ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు, పెన్నులు అందజేశారు. అనంతరం భోజన ఏర్పాట్లు కల్పించారు. విజేతల వివరాలను జూన్ రెండవ తేదీన ప్రకటించి, జూన్ 5వ తేదీన డిఇఓ చేతులు మీదుగా అందజేస్తారని వెంకటేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎం ఈ వో ఎంవిఎం సుబ్రహ్మణ్యం, కడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సత్యనారాయణ, న్యాయ నిర్ణేతలుగా ఎన్.వల్లి శ్రీదేవి,ఏసుబాబు, ఆదిబాబు, శ్రీనివాస్, జె.సత్యనారాయణలు వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్ / విశ్వం VOICE TV

మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.


# డీఎస్సీ అక్రమాలకు ఇసుక పేరుతో డైవర్షన్

**టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాంలో మంత్రి లోకేష్ అడ్డంగా దొరికిపోయాడు - దానికి సమాధానం చెప్పుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ - స్పష్టం చేసిన వైయస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్**

రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో టీచర్ రిక్రూట్‌మెంట్ స్కాం జరిగినట్టు ఆధారాలతో సహా వెలుగులోకి రావడంతో దానికి సమాధానం చెప్పుకునే ధైర్యం లేక గత ప్రభుత్వంలో ఇసుక అక్రమాలు అంటూ మరో డైవర్షన్ పాలిటిక్స్‌కి కూటమి ప్రభుత్వం తెరలేపిందని వైయస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇసుక అక్రమాల గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదని చెప్పారు. వైయస్సార్సీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా అత్యంత పాదర్శకంగా ఈ టెండర్లు నిర్వహించి ప్రభుత్వ ఖజానాకి రూ.4 వేల కోట్లు వచ్చేలా చేశామని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో ఉచిత ఇసుక అంటూ ఆ డబ్బు ప్రభుత్వ ఖజానాకి రాకుండా నాయకులు జేబులు నింపుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ మూలనైనా ఉచితంగా ఇసుక లభిస్తోందా అని ఆయన ప్రశ్నించారు. 2014-19 మధ్య గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా ఐదేళ్లలో ఇసుక పేరుతో 19 జీవోలు ఇచ్చి రకరకాలుగా ఇసుక దోపిడీకి పాల్పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వానికి రూ.4 వేల కోట్ల ఆదాయం తీసుకొచ్చిన వైయస్సార్సీపీ ఇసుక విధానంలోనే దోపిడీ జరిగి ఉంటే, ఉచిత ఇసుక అంటూ ఖజానాకి ఒక్క రూపాయి కూడా లేకుండా చేస్తున్న కూటమి వల్ల ఇంకెంత నష్టం జరిగి ఉండాలని ప్రశ్నించారు. గోదావరి జిల్లాల పరిధిలో ఒక్కో ఎమ్మెల్యే ఇసుక ద్వారా నెలకు రూ. కోటి సంపాదిస్తున్నారని, వైయస్సార్సీపీ ప్రభుత్వం వచ్చాక వారి బాగోతాలన్నీ బయటపెట్టి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని మార్గాని భరత్ హెచ్చరించారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే..**

**80 లక్షల టన్నుల ఇసుక నెలరోజుల్లో లేపేశారు**

ఒకపక్క డీఎస్సీ అక్రమాల గురించి రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతుంటే దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ అంటూ మరో డైవర్షన్ పాలిటిక్స్‌కి కూటమి ప్రభుత్వం తెరలేపింది. గత ప్రభుత్వంలో 5.08 కోట్ల టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వేశారంటూ ఈనాడు పత్రిక రాయించి ఒక అక్రమ కేసును సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇసుక అక్రమాల గురించి చంద్రబాబు అండ్ కో మాట్లాడటమే పెద్ద జోక్. ఉచిత ఇసుక అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలో ఎక్కడైనా ఉచితంగా ఇసుక దొరుకుతుందేమో చూపించాలి. మా ప్రభుత్వంలో ఏడాదికి రూ.750 కోట్ల చొప్పున, ఐదేళ్లలో నాలుగువేల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. కానీ ఇప్పుడు మరి ఆ డబ్బంతా ఎక్కడకు పోయింది? ఎవరి జేబులోకి వెళ్లిందో చెప్పాలి. మా ప్రభుత్వంలో రాష్ట్ర ఖజానాకు కనీసం డబ్బులైనా వచ్చేవి, ఇప్పుడు అదికూడా లేదు. అధికార దుర్వినియోగంతో ఇసుక చుట్టూ ఒక మాఫియాను ఏర్పాటు చేసి మొత్తం దోచేస్తున్నారు. వైయస్సార్సీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి స్టాక్ యార్డుల్లో నిల్వ ఉంచిన 80 లక్షల



టన్నుల ఇసుకను కూటమి ప్రభుత్వం వచ్చి నెలరోజులు గడవక ముందే సగం ఇసుకను టీడీపీ నాయకులు కాజేశారు. గోదావరి జిల్లాల్లో ఒక్కో ఎమ్మెల్యే కేవలం ఇసుక ద్వారానే నెలకు రూ. కోటి సంపాదిస్తున్నారు.

**ఇసుక విధానంపై రోజుకో మాట**

చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా వాదించినట్టుగా గత ఐదేళ్ల వైయస్సార్సీపీ పాలనలో 5.08 కోట్ల టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వేశారనేది వారి దృష్టిలో నిజమే అయినా, ప్రభుత్వానికి ఇసుక ద్వారా రూ. 4 వేల కోట్ల ఆదాయం వచ్చింది. అదే ఉచిత ఇసుక అని ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం ద్వారా ఇంకెన్ని వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకి నష్టం జరిగి ఉండాలి? ఈ రెండేళ్లలో ఎంత ఇసుకను దోచేశారు. ఆ డబ్బంతా ప్రభుత్వ ఖజానాకి చేరకుండా ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు? ఇప్పుడే కాదు, 2014-19లో కూడా మధ్య ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి కూడా ఆదాయం రానీయకుండా పక్కా అవినీతి పథక రచనతో ఇసుకను దోచేశారు. అదే వ్యవహారం ఇప్పుడు కూడా నడుస్తోంది. ఆరోజుల్లో ఇసుక బాధ్యతలను మొదట ఏపీఎండీసీకి అప్పగించారు. ఆ తర్వాత డ్వాక్రా సంఘాలకు ఇస్తున్నామన్నట్టుగా బిల్డప్ ఇచ్చారు. 2 నెలలు కాకుండానే దాన్నీ రద్దు చేసి టెండర్లు నిర్వహిస్తామన్నారు. చివరకు ఎలాంటి చట్టబద్ధత లేకుండా ఉచిత ఇసుక పేరుతో ఒకే ఒక్క మెమో ఇచ్చి అప్పనంగా వారి మనుషులకు అప్పగించారు. మొత్తంగా 19 జీవోలు ఆ ఐదేళ్లలో ఇచ్చారు. వైయస్సార్సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కూటమి నాయకుల ఇసుక దందాను ఖచ్చితంగా వెలుగులోకి తీసుకొచ్చి అందుకు కారకులైన వారిని చట్టపరంగా శిక్షించేదాకా పోరాడుతాం.

**నాడు పారదర్శకంగా ఇసుక ఈ టెండర్లు.. ఖజానాకి రూ.4 వేల కోట్ల ఆదాయం**

గత వైయస్సార్సీపీ ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా ఇసుక విధానాన్ని అమలు చేశాం. దోపిడీలకు అడ్డుకట్ట వేసి ఇటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా, అటు వినియోగదారునికీ సరసమైన ధరకు అందేలా కేంద్ర ప్రభుత్వ ఫ్లాట్ ఫాం మీద ఈ-టెండర్లు నిర్వహించాం. రీచ్‌ల వద్ద ఆపరేషన్ ఖర్చులతో కలిపి టన్ను ఇసుకను రూ.475కే సరఫరా చేయడం జరిగింది. ఇందులో రూ.375లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి చేరేది. రవాణా ఛార్జీలతో కలిపి ప్రతి నియోజకవర్గానికీ ఇసుక రేట్లను ప్రకటించాం. వైయస్సార్సీపీ ప్రభుత్వాన్ని నిరంతరం దుమ్మెత్తిపోసే పత్రికల్లో కూడా నియోజకవర్గాల వారీగా పారదర్శకంగా రేట్లపై ప్రకటనలు ఇచ్చాం. ప్రజలకు ఒకవైపు తక్కువ ధరకు ఇస్తూనే మరోవైపు రాష్ట్ర ఖజానాకు డబ్బులు వచ్చేట్టుగా చేశాం. రేట్లపై సెబ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేసి తప్పులకు ఆస్కారం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నాం. తద్వారా ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయాన్ని ఖజానాకు వచ్చేలా చేశాం.

**డీఎస్సీ అక్రమాలపై మంత్రి లోకేష్ సమాధానం చెప్పాలి**

సంక్షేమం, అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో చర్చించడానికి నారా లోకేష్ చేసిన సవాల్‌ను వైయస్సార్సీపీ జాతీయ మీడియా అధికార ప్రతినిధిగా నేను స్వీకరిస్తున్నా. దీనిపై బహిరంగ చర్చకు ఎప్పుడు, ఎక్కడికి రమ్మన్నా రావడానికి నేను సిద్ధంగానే ఉన్నాను. డీఎస్సీలో మొదటి ర్యాంకు తెచ్చుకున్న నవీన్ అనే వ్యక్తికి ఎందుకు ఉద్యోగం ఇవ్వలేదో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూటిగా చెప్పగలరా? సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి రాలేదని చెబుతున్నారు. కానీ, ఇదే నవీన్ ప్రభుత్వం తన ఐడీని బ్లాక్ చేసి కాల్ లెటర్ రాకుండా చేసిందని హైకోర్టును కూడా ఆశ్రయించారు.



# అభివృద్ధికి నోచుకోని ప్రధాన మురుకు కాలువ

## పట్టించుకోని అధికారి యంత్రాంగం





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం రామయ్య వీధిలో అభివృద్ధికి నోచుకోని ప్రధాన మురుక్కు కాలువ ఎన్నో ఏళ్ల నుంచి ఈ మురికి కాలువ చెత్తాచెదారాలతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో, మట్టితో, చెత్త మొక్కలతో మురుగునీరు ప్రవాహానికి దారి లేకుండా ఉంది. ఈ మురికి నీటి డ్రైనేజ్ పై ఇప్పటివరకు ఏ విధమైన చర్యలను తీసుకోకుండా వదిలేసిన సంబంధిత అధికారులు.ఏళ్లు గడిచినా ప్రభుత్వాలు మారిన ఈ డ్రైనేజీ వ్యవస్థ రూపు మార్చే నాయకుడే లేరా అభివృద్ధి పేరుతో రోడ్లను, వీధిలైట్లను, డ్రైనేజీలను, మంచి నీటి కుళాయిలను, అనేక భవనాలను, నిర్మించడానికి ఉండే గ్రాండ్లు ఈ డ్రైనేజీ నిర్మించడానికి లేవా! అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పంచాయతీ అధికారులు ఈ డ్రైనేజీలో చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని డ్రైనేజీకి ఇరువైపులా ఉన్న చెత్త మొక్కలను నిర్మూలించాలని, డ్రైనేజీ పై దోమలకు మందును కొట్టి వీధిలో ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని కలిగించాలని కోరుతున్నారూ గత కొన్ని రోజులుగా పందులు అధికంగా ఈ డ్రైనేజీలో చేరి చుట్టుపక్కల ప్రజలకు అనారోగ్యానికి గురి అవుతున్నారు.గతంలో ఈ పందులపై పంచాయతీలో ఫిర్యాదు చేయగా పందుల యజమానులు పందులను జనవాసాలలో ప్రజల మధ్య విచ్చలవిడిగా వదలమని దగ్గరుండి పందులను ఊరి చివర పెంచుకుంటామని పోలీసు వారి సమక్షంలో హామీ పత్రాలను గతంలో పంచాయతీ అధికారులకు ఇచ్చినప్పటికీ మరలా యధావిధిగా పందులను జనవాసాలలో రామయ్య వీధి ప్రధాన మురికి కాలువ పరిసర ప్రాంతాలలో వదిలిపెట్టి వెళ్ళటం జరుగుతుంది.దీనిపై కూడా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని పందులను నిర్మూలించాలని పంచాయతీ అధికారులను కోరుతున్నాము.స్థానిక ఎమ్మెల్యే రామయ్య వీధిలో ఉన్న ప్రధాన మురుగు కాలువపై స్పందించి కొత్త డ్రైనేజీని నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నాము అని తెలియజేశారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

### కే.గంగవరంలో మహిళా ఉపాధి అవగాహన సదస్సు



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు ఆర్థికంగా బలోపేతమై కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం గంగవరంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా అభ్యుదయ వేదిక మరియు ఉపాధి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలన్నదే తమ లక్ష్యమని మార్కెట్‌లో డిమాండ్ ఉన్న రంగాల్లో మహిళలకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు బ్యాంక్ రుణాల కోసం పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. “మహిళా అడ్డా” కాన్సెప్ట్ ద్వారా ప్రస్తుతం ఉపయోగంలో లేని భవనాలు, సినిమా హాళ్లు, కమ్యూనిటీ సెంటర్లను మహిళల ఉపాధి కేంద్రాలుగా మారుస్తామని, వీటి ద్వారా డెకరేషన్, క్యాటరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చి ఆదాయ మార్గాలను సృష్టిస్తామని మంత్రి వివరించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జూన్ 17లోపు కొన్ని స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించడమే తమ లక్ష్యమని మంత్రి సోదరి శ్రీ సత్య పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఫౌండేషన్ చేపడుతున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, నేమాని సత్యనారాయణ, ఏపీఎం ఎం. శామ్యూల్, వైట్ల మంగాదేవి, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్‌పై దూషణలు చేసిన వారిపై

# కేసులు నమోదు చేయాలి

### జనసేన నేతల డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ ఉద్యమకారుల పేరుతో హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అవమానిస్తూ, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కొందరు వ్యక్తులు వ్యవహరించారని ఆరోపిస్తూ జనసేన పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ మర్యాదలకు విరుద్ధమని పేర్కొంటూ, బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అమలాపురం నియోజకవర్గ ముఖ్య నాయకుడు లింగోలు పండు ఆధ్వర్యంలో స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో కొందరు వ్యక్తులు తెలంగాణ ఉద్యమకారుల ముసుగులో మాట్లాడుతూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత దూషణలు చేయడం, చిత్రపటాలను అవమానించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు సమాజంలో అనవసర ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన వారిపై సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణమూర్తి, ఏఎంసీ వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబు, మాజీ ఉపసర్పంచ్‌లు వాకపల్లి వెంకటేశ్వరరావు, హనుమాన్ బుజ్జి, ఎంపీటీసీలు మోటూరి వెంకటేశ్వరరావు, కోరుమిల్లి రామచంద్రరావు, సాకుర్రు సొసైటీ చైర్మన్ నల్లా వెంకటేశ్వరరావు, రంగాపురం సొసైటీ చైర్మన్ సత్తి రామచంద్రరావు, నీటి సంఘం డైరెక్టర్ నారాయణస్వామి, నాయకులు చింతపల్లి చిన్నా, నందుల సత్తిబాబు, నల్లా మూర్తి, సత్తి శ్రీనివాస్, కానిపూడి రమేష్, బండారు సురేష్, చవ్వాకుల ఉమామహేశ్వరరావు, నిట్టాల రాజా, పిల్లా రవి, రంకిరెడ్డి రామకృష్ణ, మట్టా నాగబాబు, కొప్పుల సత్య, అడపా సిద్ధూ, నక్కా రామకృష్ణ, మాజీ వార్డు సభ్యురాలు తిక్కా సరస్వతి, కుంపట్ల నాయుడు, ఆత్మా డైరెక్టర్ మంగతాయారు, వీర మహిళ నీతిపూడి ధనలక్ష్మి తదితర జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ అభిప్రాయ స్వేచ్ఛ ఉన్నప్పటికీ, అది ఇతరులను అవమానించే స్థాయికి చేరకూడదని వారు స్పష్టం చేశారు. రాజకీయ మర్యాదలను కాపాడుతూ సామాజిక సామరస్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

### ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా

# అవగాహన ర్యాలీ




**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో శివల గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను, ముఖ్యంగా నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదాలను ప్రజలకు వివరించారు. పొగాకుకు అలవాటు పడిన వారు ఆ అలవాటును మానుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించే క్రమంలో పొగాకుకు ప్రత్యామ్నాయంగా బబుల్‌గంలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌజన్య, రైతు నాయకులు బలుసు శివ, సుబ్బు, కృష్ణ, రామకృష్ణ, గ్రామ పెద్దలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా

# బాధ్యతలు స్వీకరించిన చిట్టిబాబు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కందికట్ల చిట్టిబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే కళాశాలలో గణిత అధ్యాపకుడుగా పని చేసిన చిట్టిబాబు నేడు ప్రభుత్వం కల్పించిన పదోన్నతిలో భాగంగా ఇదే కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమితులైనారు.ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన చిట్టిబాబును కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కందికట్ల చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సహకారంతో కళాశాల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానన్నారు. తాను గతంలో పనిచేసిన కళాశాలలో తిరిగి నేడు ప్రిన్సిపాల్‌గా రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

### రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో

# సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, ద్రాక్షారామ మరియు పామర్రు పోలీస్ స్టేషన్ల పరిధిలో జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పోలీసులు ప్రకటించారు. ఈ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు లేదా ఊరేగింపులు నిర్వహించడానికి వీలు లేదు. ఏవైనా కార్యక్రమాలు చేపట్టాలనుకునే వారు రామచంద్రపురం పోలీసు సబ్ డివిజన్ డీఎస్పీ (రాణూరా) కార్యాలయంలో ముందుగా దరఖాస్తు చేసుకుని అనుమతి పొందవలసి ఉంటుంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రజలందరూ పోలీసులకు సహకరించి నిబంధనలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

### కోనసీమ రైతులకు శుభవార్త

# ఖరీఫ్ సాగు కోసం గోదావరి జలాల విడుదల



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖరీఫ్ పంటల సాగును దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ముందస్తుగా గోదావరి నీటిని విడుదల చేసింది. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద జరిగిన నీటి విడుదల పూజా కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి, మంత్రి కందుల దుర్గేష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డెల్టా చైర్మన్ సునీల్ మరియు పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ.రైతుల ప్రయోజనాలను కాపాడటంలో భాగంగా ప్రభుత్వం సకాలంలో నీటిని విడుదల చేసిందని పేర్కొన్నారు. సాగునీరు అందుబాటులోకి వచ్చినందున కోనసీమ రైతులు తమ పంట సాగు పనులను ప్రారంభించుకోవచ్చని ఆయన సూచించారు.

### ద్రాక్షారామలో ఘనంగా అహల్యాబాయి హోల్కర్

# 301వ జయంతి వేడుకలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో మహారాణి అహల్యాబాయి హోల్కర్ 301వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల బిజెపి అధ్య క్షుడు ఆకేటి శ్రీ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు యల్లన శకుంతల అధ్యక్షత వహించగా అనకాపల్లి జిల్లా బిజెపి ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మాల్వా రాజ్య మహారాణిగా అహల్యాబాయి హోల్కర్ అందించిన సేవలను కొనియాడారు. రైతులు, మహిళలు మరియు పేదల సంక్షేమం కోసం ఆమె అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా అనేక దేవాలయాలు, ఘాట్లు, ధర్మశాలల నిర్మాణం ద్వారా సనాతన ధర్మ పరిరక్షణకు ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి, జిల్లా కార్యదర్శి మేకా ఆదిలక్ష్మి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు పి.వసంత, మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహబూబా షాహీరా, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శులు కుసుమ సునీత, వాసంశెట్టి రాజేశ్వరి, మండల అధ్యక్షురాలు దాసరి రామేశ్వరి, పద్మావతిలతో పాటు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, కొట్టువాడ హరిబాబు, దునే శ్రీనువాస్, సలాది రామకృష్ణ, ఇంధన సత్యనారాయణ, పుల్లెల రామమూర్తి మరియు ఇతర బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# రామచంద్రపురంలో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

### ఏఐకెఎంఎస్, ఐఎఫ్టీయూ డిమాండ్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు స్థానిక ప్రజల జీవనోపాధిని, వ్యవసాయాన్ని మరియు పర్యావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) జిల్లా నాయకులు వి. భీమశంకరం, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, జిల్లా నాయకులు చింతా రాజారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా వందలాది ట్రాక్టర్ల ద్వారా సాగుతున్న ఈ అక్రమ రవాణా వల్ల దుమ్ము, శబ్ద కాలుష్యం పెరిగి ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. రాకపోకల వల్ల గ్రామ రహదారులు ధ్వంసం కావడమే కాకుండా చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు మీదకు రావడానికి భయపడే పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. నిన్న జరిగిన ప్రమాదంలో బొమ్మ సూర్య వీర వెంకట నాగ కృష్ణమూర్తి మృతి చెందడం ఆయన భార్య దుర్గాభవాని తీవ్ర గాయాల పాలవ్వడం బాధాకరమని ఇందుకు డ్రైవర్ల నిర్లక్ష్యం అతివేగమే కారణమని వారు ఆరోపించారు. మట్టి రవాణా చేసే వాహనాలకు సరైన పత్రాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకపోవడమే కాకుండా డ్రైవింగ్ లైసెన్సులు లేని వ్యక్తులు వాహనాలు నడుపుతున్నారని వారు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బాధితులకు మెరుగైన వైద్యం, ఆర్థిక సహాయం అందించాలని అక్రమ మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి లైసెన్సులు లేని వాహనాలను సీజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం

### సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఉపాధి శిక్షణ



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబానికి వెన్నెముకగా నిలవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆకాంక్షించారు. కాజులూరు మండలం గొల్లపాలెంలో నిర్వహించిన మహిళా ఉపాధి అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించే మహిళలకు ఉచిత శిక్షణతో పాటు బ్యాంక్ రుణాల కోసం అవసరమైన ఆర్థిక మార్గదర్శకత్వాన్ని ఫౌండేషన్ అందిస్తుందని హామీ ఇచ్చారు. అమరావతి నుంచి సెల్‌ఫోన్ ద్వారా సందేశాన్ని అందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్, “మహిళా అడ్డా” కార్యక్రమం ద్వారా నిరుపయోగంగా ఉన్న భవనాలను ఉపాధి కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్, డెకరేషన్ వంటి రంగాల్లో శిక్షణ ఇచ్చి మహిళలు ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా మహిళల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ఫౌండేషన్ లక్ష్యమని మంత్రి సోదరి శ్రీ సత్య పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామని స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తిస్తున్నామని ఆమె తెలిపారు. ఎంపీడీవో జె.రాంబాబు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె.రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చావ్వాకుల నారాయణమూర్తి, అన్యం శ్రీరామ్, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# దువ్వూరి సుబ్బమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి : యాట్ల



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామంలో స్వాతంత్ర్య సమరయోధురాలు, దేశభాంధవి దువ్వూరి సుబ్బమ్మ 62 వ వర్ధంతి సందర్భంగా ద్రాక్షారామ లో ఆమె చిత్రపటానికి నియోజకవర్గం ఎం.బీ.సీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్ళిన తొలి అంధ్ర మహిళ. ద్రాక్షారామ లో నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బమ్మ కు చిన్న తనంలో వివాహం జరిగింది. ఆమె భర్త మరణించడంతో దేశ స్వాతంత్ర్యం కోసం ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.1923 కాకినాడ లో జరిగిన స్వాతంత్రోద్యమ సభలో పాల్గొని అనర్గళంగా మాట్లాడిన ప్రసంగానికి మహాత్మా గాంధీ ఆనందించి ఆమెకు దేశబాంధవి అనే బిరుదును ఇచ్చారని తెలిపారు. ఆమె జయంతి నవంబర్ 15 న ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా జయంతి కార్యక్రమం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆమె జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ వ్రాస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి శ్రీనివాస్, పెద్దిరెడ్డి సుబ్బారావు, ఎం.డి అబ్బాస్ పాల్గొన్నారు.



## రోళ్లు పగిలే రోహిణీ కార్తె

# దంచి కొడుతున్న ఎండలు....!



- 10-4 గంటల మధ్య జనసంచారం అంతంతే...
- ఉష్ణోగ్రత నుంచి రక్షణకు ఉపశమన మార్గాలు పాటించాలి
- లేలేత రంగుల దుస్తులనే ధరించాలి
- సాధారణ, సాత్విక ఆహారాన్నే స్వీకరించాలి
- వడదెబ్బకు వైద్యుల సహాయం తీసుకోవాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సూరయ్య మండిపోతూ ఉన్నాడు. తెలుగు రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో 45 నుండి 47 సెల్సియస్ డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ 2026 ఏడాది మే 25 సోమవారం రోహిణి కార్తె ప్రారంభమైంది. తెలుగు పంచాంగం ప్రకారం సూర్యుడు రోహిణి నక్షత్రంలో ప్రవేశించడంతో మొదలయ్యే రోహిణి కార్తె తిరిగి సూర్యుడు మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించే వరకు దాదాపు 15 రోజుల పాటు జూన్ 7 ఆదివారం వరకు కొనసాగుతుంది. జూన్ 8 సోమవారం నుంచి మృగశిర కార్తె ప్రారంభం అవుతుంది. ఈ రోహిణి కార్తె ప్రారంభమై ఇప్పటికే వారం రోజులు పూర్తి అయ్యింది. ఈ రోహిణి కార్తె అనేది హిందూ జ్యోతిష, వ్యవసాయ పంచాంగాల ప్రకారం ఎండలు అత్యంత తీవ్రంగా ఉండే సమయం. సూర్యభగవానుడు భగ భగ మండి పోతున్నాడు. ఈ రోహిణి కార్తెలో సూర్యుని ప్రతాపం అత్యంత తీవ్రంగా ఉన్నది. వడగాల్పులు, ఉక్కపోత అత్యంత దారుణంగా, చాలా ఎక్కువగా ఉన్నాయి. ఏడాది మొదటి నాలుగు నెలలుగా వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే, కేవలం రోహిణి కార్తె ఈ పక్షం రోజుల్లో సూర్యుని తీవ్రత తీవ్ర స్థాయికి చేరుకుందని, ఈ సమయంలో రోళ్లు పగిలేంతగా ఎండలు మండిపోతాయని అంటున్నారు. రోహిణి కార్తెలో భూమిపై సూర్యకిరణాలు నిటారుగా పడటం వల్ల ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగు తున్నాయి. ఈ తీవ్రమైన వేడిమికి సకల జీవరాశి అల్లాడి పోతోంది. ఉదయం 10 సాయంత్రం 4 గంటల మధ్య ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం 12 నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లడం తగ్గించేసారు. వడదెబ్బ తీవ్రత ఎక్కువగా ఉన్నందున, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇండ్ల నుంచి బయటకు వెళ్లాల్సి వస్తే గనుక బయటకు వెళ్లేటప్పుడు సూర్యరశ్మి నుండి రక్షణకు తప్పనిసరిగా గొడుగు, టోపీ, స్కార్ఫ్, చలువ కళ్ళద్దాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలి. శరీరాన్ని పూర్తిగా కప్పేసే తెలుపు, లేత రంగుల కాటన్ దుస్తులను మాత్రమే ఒంటికి గాలి ఆడేలా ధరించాలి. ఉష్ణాన్ని ఎక్కువగా స్వీకరిస్తాయి గనుక నలుపు రంగు దుస్తులను అసలు ఏమాత్రమూ ధరించవద్దని, ముదురు రంగు దుస్తులు వేడిని ఎక్కువగా పీల్చుకుంటాయని పేర్కొంటున్నారు. దాహంతో వచ్చే బాటసారులకు తాగు నీటిని అందించాలని, పశువులు, పక్షులు దాహం తీర్చుకునేలా నీటిని ఏర్పాటు చేయడం మంచిదని, ఎండ వేడిమి ఎక్కువగా ఉంటే చిన్న పిల్లలను తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చడం వంటి ఇతర జాగ్రత్తలను కూడా పాటించాలని సూచిస్తున్నారు. ఈ ఎండలు నుంచి రక్షణ, ఉపశమనం కొరకు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు, రాగిజావ, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పండ్ల రసాలు, ఓఆర్ఎస్. ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. మసాలా పదార్థాలు, వేపుళ్లు, నూనె ఎక్కువగా ఉండే ఆహారానికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే సాధారణ, సాత్విక ఆహార పదార్థాలనే తీసుకోవాలి. మసాలాలు, నూనె పదార్థాలు తగ్గించడం మంచిది. వేడిని తగ్గించ్చేందుకు మట్టి కుండలోని నీటిని తాగడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## అమలాపురంలో ఘనంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'..

### డ్రైనేజీల పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కలిసి మురుగునీటి కాలువల (డ్రైనేజీల) శుభ్రపరిచే పనులను స్వయంగా పరిశీలించారు. పట్టణ ప్రాంతాల్లో వర్షాకాలంలో మురుగునీరు నిల్వ కాకుండా ఉండేందుకు కాలనీలోని ప్రధాన డ్రైనేజీలలో పూడికతీత, వ్యర్థాల తొలగింపు పనులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంటేనే ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉంటారని అన్నారు. అందుకే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా మురుగు కాలువల శుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ అమలాపురం పట్టణంలో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మురుగునీరు సజావుగా ప్రవహించేలా కాలువలను నిరంతరం శుభ్రపరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగాబత్తులకు టీచర్స్ యూనియన్ నాయకులు పరామర్శ



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖకు గౌరవాధ్యక్షులుగా వ్యవహరిస్తున్న నాగాబత్తుల నరసింహమూర్తి సతీమణి లక్ష్మి ఇటీవల స్వర్గస్తులయ్యారు. విశ్రాంత ఉపాధ్యాయుడైన నరసింహమూర్తిని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆయనను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాదం నుండి నరసింహమూర్తి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అంబాజీపేట మండలం అతని స్వగ్రామం నందంపూడి వెళ్లి పలకరించిన వారిలో ఎస్ఎన్ మునేశ్వరరావు, జీవివి సత్యనారాయణ, గుత్తాల వెంకటేశ్వరరావు, ఎన్.గంగాధరరావు, నెల్లి వెంకట్రావు, ఎన్.సత్యనారాయణ, పి.కృష్ణమూర్తి, పి.మోహన్‌రావు, నందిక వెంకటేశ్వరరావుతోపాటు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

### మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో

## జాతర మహోత్సవాల్లో కుడుపూడి సత్తిబాబు


### అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహణ



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవలేశ్వరంలోని ప్రసిద్ధ శ్రీశ్రీశ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలకు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించిన సత్తిబాబు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులను కోరారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలి

### కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి పిలుపు



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఖరీఫ్ పంటల సాగుకు గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాగునీరు విడుదల చేయడం పై భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చింతా తమ్మిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి విడుదలకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, సాన సతీష్, జీఎం హరీశ్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖరం, ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ తదితర కూటమి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చింతా తమ్మిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కాటన్ బ్యారేజ్ గేట్లు మరమ్మతులకు గురయ్యాయని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు మంజూరు చేసి గేట్ల మరమ్మతులు చేపట్టడం అభినందనీయమన్నారు. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగడం రైతాంగానికి, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో ఋతుపవనాల పరిస్థితిపై స్పష్టత లేకపోవడంతో రైతులు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో రసాయనిక ఎరువులు, పురుగుమందుల కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుంటూ, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి కిసాన్ మోర్చా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## లీగ్ కమ్ నాకౌట్ టేబుల్ టెన్నిస్ పోటీలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక టౌన్ హాల్ ఎదురుగా రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో తూర్పు గోదావరి కాకినాడ జిల్లాల లీగ్ కమ్ నాకౌట్ టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీల ప్రారంభోత్సవానికి డాక్టర్ జె. మహాలక్ష్మి (మౌనిక రెడ్డి) ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో కాకినాడ పెద్దాపురం రాజమహేంద్రవరం నుండి దాదాపు 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో అండర్ 11 అండర్ 13 అండర్ 15 అండ్ 17 మరియు సీనియర్స్ కు సింగిల్స్ అండ్ డబుల్స్ భాగాలలో బాలబాలికలకు కలిపి పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జెవివి అప్పారెడ్డి కార్యదర్శి, వి టి వి సుబ్బారావు, కోశాధికారి కె సత్యనారాయణ( భీము), విశాల్, కోచ్ పి.వేణుగోపాలరావు, సూరపురెడ్డి సూర్యప్రకాష్, సింగరాజు, పివి సత్యనారాయణరావు, ఎన్ఎస్ పాల్గొన్ ఏ.శ్రీకాంత్, కర్రి వీరబాబు, జి.అనురాధ, బి అచ్యుత్ కుమార్, జి సిరిపావని, జీ.తాన్యశ్రీ, తదితరులు పాల్గొని పోటీలను నిర్వహించారు.

### కంప్యూటర్ ఆపరేటర్లు, కోర్టు కానిస్టేబుళ్ల పనితీరుపై

## జిల్లా ఎస్పీ సమీక్ష

### కోర్టు కానిస్టేబుళ్లు కేసుల విచారణలో కీలక పాత్ర పోషించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శనివారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు చెందిన కంప్యూటర్ ఆపరేటర్లు, కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లలో నిర్వహించాల్సిన డేటా ఎంట్రీ, కేసుల రికార్డుల నిర్వహణ, (సీసీటీఎన్ఎస్) నమోదు, డిజిటల్ డాక్యుమెంటేషన్, కోర్టు కేసుల పురోగతి, సమన్లు, వారెంట్ల అమలు, పెండింగ్ కోర్టు వ్యవహారాలపై సమీక్షించారు. కోర్టు కానిస్టేబుళ్లు కేసుల విచారణలో కీలక పాత్ర పోషిస్తారని పేర్కొంటూ, సమన్లు మరియు వారెంట్ల అమలు, సాక్షుల హాజరు, కేసు డాక్యుమెంట్ల సమర్పణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులు మరియు కోర్టు సిబ్బందితో సమన్వయం పెంపొందించడం ద్వారా కేసుల కన్విక్షన్ రేటును గణనీయంగా మెరుగుపరచవచ్చని సూచించారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్లు పోలీస్ స్టేషన్లలో డేటా నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టి, సీసీటీఎన్ఎస్, ఇతర సాంకేతిక వ్యవస్థల వినియోగంలో ఎటువంటి లోపాలు లేకుండా పనిచేయాలని ఆదేశించారు. డిజిటల్ పోలీసింగ్ వ్యవస్థలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసింగ్‌లో పారదర్శకత, పనితీరు మరింత మెరుగుపడుతుందని ఎస్పీ తెలిపారు. స్మార్ట్ పోలీసింగ్ అమలు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ, అధిక కన్విక్షన్ రేటు సాధన లక్ష్యాల కోసం పనిచేయలని ఆదేశించారు.

### గ్రూప్-1 అధికారి సలికినిడి భవ్య కిషోర్‌కు

## ఏఎస్పీగా పదోన్నతి



**వేలూరు-చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గతంలో కదిరి డీఎస్పీగా పని చేసిన గ్రూప్-1 2018 బ్యాచ్ అధికారి సలికినిడి భవ్య కిషోర్‌కు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి లభించింది. విధి నిర్వహణలో ప్రతిభ విధుల్లో చూపిన అంకితభావం, ప్రతిభకు గుర్తింపుగా ఈ పదోన్నతి దక్కిందని అధికారులు తెలిపారు. మంగళగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ ప్రస్తుతం ఆమె మెటర్నిటీ సెలవులో ఉన్నారు. సెలవులు ముగిసిన అనంతరం మంగళగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వేలూరు ప్రజల హర్షం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన పోలీస్ అధికారి ఏఎస్పీగా పదోన్నతి పొందడం గ్రామానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు భవ్య కిషోర్‌కు అభినందనలు తెలియజేస్తున్నారు.

## ఫూలే సామాజిక చైతన్య వేదిక

### కెఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జోతిబా ఫూలే ద్వి శతదినోత్సవ సంవత్సర వేడుకల్లో భాగంగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సారథ్యంలో ఫూలే సామాజిక చైతన్య వేదిక, కెఎస్ఆర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎముకల బలం (బిఎండి) నిర్ధారణకు ఉచిత వైద్య పరీక్షలునిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. న్యూరో పరీక్షలు కూడా చేశారు.గోదావరి గట్టున ఉన్న ఫూలే-అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు (బాబు) ప్రారంభించారు. బిఎండి పరీక్షల- 1వవిభాగాన్నికె.ఎస్.ఆర్.ఆసుపత్రి అధినేత డాక్టర్ కొమ్మ శ్రీనివాసరావు, 2వ విభాగాన్ని నల్లం శ్రీను, న్యూరో పరీక్షల విభాగాన్ని డాక్టర్ కొమ్మ సుస్మిత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఫూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు మాట్లాడుతూ ఫూలే ద్విశతదినోత్సవ సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రతినెల ఒక సామాజిక సేవా కార్యక్రమం చేపడుతున్నామని ఈనెలలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని చెప్పారు. డాక్టర్ సుస్మిత, డాక్టర్ కొమ్మ శ్రీనివాస్ మాట్లాడుతూ బిఎండి పరీక్షల వల్ల ఎముకల బలహీనతను ముందుగానే గుర్తించి సరైన కాల్షియం, విటమిన్-డి.చికిత్స అందించవచ్చని తద్వారా వృద్ధాప్యంలో ఎముకల సమస్యలనుతగ్గించవచ్చన్నారు.45 సంవత్సరాలు పైబడిన మహిళలు,50 సంవత్సరాలు దాటిన పురుషులు బిఎండి పరీక్షలుచేయించుకోవాలని, అలాగే తరుచుగా మెడనొప్పి నడుం నొప్పి,కీళ్ళ నొప్పులు,కాల్షియం లోపం ఉన్నవారు, థైరాయిడ్, షుగర్, కిడ్నీ, సమస్యలు, పొగతాగడం, మద్యం సేవించే అలవాటు ఉన్నవారు ఈ పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కెఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఉజ్వల్, కె.కె.సంజీవరావు, మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, డాక్టర్ బళ్ళ శ్రీనివాసరావు, కొంకి రమేష్, సీ.హెచ్.సుబ్బారావు, దాలిపర్తి వేమన, మలసాని శ్రీనివాస్, సప్పా వెంకటరమణ, నల్లం ఆనంద్ కుమార్, బొట్టా వీరబాబు, జె.వి.వి.సత్యనారాయణ, కొమ్మ రమేష్, రేలంగి శేఖర్, అత్తిలి శ్రీను, పి.ఎఫ్.రవి, నెల్లి సర్వేశ్వరరావు, కొప్పిశెట్టి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా పంపిణీ

### దివ్యాంగులకు వరం దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్




**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదివారం ఉదయం స్థానిక కొవ్వూరు పట్టణంలోని లిటరరీ క్లబ్ లో 30 మంది దివ్యాంగులకు 2 లక్షల విలువైన జైపూర్ లెగ్స్, కాలిపర్స్ దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ చిడిపి ద్వారా andi chuta జరిగినది అని ట్రస్ట్ ఛైర్మన్ ప్రత్తిపాటి నాగరాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో దివ్యాంగులు ఎవరైన ట్రస్ట్ వారిని సంప్రదిస్తే కృత్రిమ అవయువాలు, ట్రై సైకిల్స్, ఉపకారణాలు అందిస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా వచ్చిన సూరపనేని చిన్ని మాట్లాడుతూ ట్రస్ట్ కు పార్టీ తరుపున మరియు ప్రభుత్వం తరుపున సహాయ సహకారములు అందిస్తాం అని అన్నారు. ట్రస్ట్ గౌరవ డైరెక్టర్స్ జోడాల వెంకట్, అంకం బాబు, ప్రవీణ్ లు మాట్లాడుతూ ట్రస్ట్ కు ఎల్లప్పుడూ మా సహాయ సహకారాలు ఉంటాయి అని ఆర్థిక పరమైన సహకారం అందిస్తూనే ఉంటాం అని అన్నారు. కొవ్వూరు లో సహాయ సహకారములు అందిస్తున్న వైకే శ్రీనివాస్, విల్సన్ రాజ్ లకు ట్రస్ట్ సభ్యులు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి 4జిల్లాల నుండి దివ్యాంగులు, ట్రస్ట్ దాత జోడాల రామాదేవి ట్రస్ట్ సభ్యులు అనపర్తి రాజు,తొర్లపాటి రాజీవ్, కాట్రూ ప్రశాంత్ కుమార్, సాధానాల కిషోర్, నేరేడుమిల్లి ప్రకాష్, నేరేడుమిల్లి ప్రభాస్, కవల రోహిత్, అనిల్, శాత్విక్ లు పాల్గొన్నారు. దివ్యంగులు మాట్లాడుతూ వారి జీవితాలలో వెలుగులు నవ్వులు చిందించేట్లు చేస్తున్న దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ వారికి రుణపడి ఉంటాం అని అన్నారు.





# రాజమండ్రి పేపర్ మిల్ కాలుష్యం..
# గోదావరి గుండె కకావికలం అవుతోంది













**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం**

గోదావరి ఒడ్డున దశాబ్దాలుగా నిలబడిన రాజమండ్రి పేపర్ మిల్ ఒకప్పుడు వేలాది కుటుంబాలకు ఉపాధి ఇచ్చిన గర్వకారణం. కానీ ఈరోజు అదే మిల్ నుంచి వెలువడుతున్న కాలుష్యం గోదావరిని విషతుల్యం చేస్తూ, పరిసర గ్రామాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. సూర్యోదయానికి ముందే మిల్ చిమ్నీల నుంచి నల్లని పొగలు ఆకాశాన్ని కప్పేస్తున్నాయి. అదే సమయంలో కర్మాగారం నుంచి బయటకు వచ్చే రసాయన మిశ్రిత వ్యర్థ జలాలు ఎలాంటి శుద్ధి లేకుండా నేరుగా గోదావరి పొలిమేరల్లోకి చేరుతున్నాయి. దీంతో ఒకప్పుడు స్వచ్ఛంగా ప్రవహించిన గోదావరి నీళ్లు ఇప్పుడు నల్లగా మారి, నురగతో కమ్ముకుని, భరించలేని దుర్వాసన వెదజల్లుతున్నాయి. దౌలేశ్వరం, కోటిపల్లి, ద్వారాపూడి వంటి గ్రామాల్లో నివసించే వృద్ధులు "మేము చిన్నప్పుడు ఈ నది నీళ్లనే దాహం తీర్చుకునేవాళ్లం. ఇప్పుడు ఆ నీళ్లు తాకితే చర్మం వ్యాధులతో "అని కన్నీటి పర్యంతమవుతున్నారు. గోదావరి నది నీటి కలుషితం ఆగడం లేదు. పేపర్ మిల్ చుట్టుపక్కల భూగర్భ జలాలు కూడా నెమ్మదిగా విషంగా మారుతున్నాయి. స్థానికంగా నిర్వహించిన నీటి నమూనాల పరీక్షల్లో క్లోరైడ్లు, సల్ఫేట్లు,భారీ లోహాల మోతాదు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు తేలింది. ఫలితంగా ఆ ప్రాంత ప్రజల్లో కిడ్నీ సంబంధిత వ్యాధులు, చర్మ రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి రికార్డుల ప్రకారం గత మూడేళ్లలో జల జనిత వ్యాధులతో వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం, వృద్ధుల్లో దీర్ఘకాలిక అనారోగ్యాలు సర్వసాధారణమయ్యాయి. వైద్య నిపుణులు ఈ పరిస్థితిని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. పేపర్ మిల్ ప్రక్రియలో వినియోగించే క్లోరిన్, లిగ్నిన్ వంటి రసాయనాలు నీటిలో కలిసినప్పుడు అవి దీర్ఘకాలంలో క్యాన్సర్ కారకాలుగా మారే అవకాశం ఉందని డాక్టర్లు చెబుతున్నారు. "ఇలాంటి నీటిని రోజూ తాగితే కాలేయం, మూత్రపిండాల పనితీరు దెబ్బతింటుంది. ఇది నిశ్శబ్ద హంతకుడిలా పని చేస్తోంది" అని ఒక సీనియర్ వైద్యుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నా, గ్రౌండ్ స్థాయిలో మార్పు మాత్రం కనిపించడం లేదు. "మిల్ మూసేయమని మేము అడగడం లేదు కాని, కనీసం జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానం అమలు చేసి, శుద్ధి చేసిన తర్వాతే నీళ్లను నదిలోకి వదలాలి. ప్రజల ప్రాణాల కంటే లాభాలు పెద్దవి కావు" అని 'గోదావరి పరిరక్షణ సమితి' కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. గోదావరి పుష్కర పనుల పరిశీలన నిమిత్తం రాజమండ్రికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నది ఒడ్డున స్వయంగా గోదావరి జలాల నమూనాలను సేకరించి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కాలుష్య స్థాయి అధికంగా ఉన్నట్లు తేలడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "గోదావరి కోట్లాది మంది తాగునీటికి, వ్యవసాయానికి ఆధారం. ఇలాంటి పవిత్ర నదిని కాలుష్యానికి గురి చేయడం తీవ్రమైన విషయం" అని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. వెంటనే సంబంధిత శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించి, పరిశ్రమల వ్యర్థాలను నదిలోకి వదలకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పుడే కఠిన చర్యలు తీసుకోకపోతే రేపు రాజమండ్రి, కోటిపల్లి, అనపర్తి వంటి పట్టణాల లక్షలాది మంది తాగునీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి వస్తుంది. ఎందుకంటే ఈ ప్రాంతాల తాగునీటి అవసరాలన్నీ గోదావరిపైనే ఆధారపడి ఉన్నాయి. అభివృద్ధి పేరుతో ఒక నదిని, ఒక ప్రజల ఆరోగ్యాన్ని బలి ఇవ్వడం న్యాయమా అన్న ప్రశ్న ఇప్పుడు ప్రతి ఒక్కరి మనసును తొలుస్తోంది. గోదావరి మళ్లీ తన పూర్వ వైభవాన్ని పొందాలంటే, పరిశ్రమ, ప్రభుత్వం, ప్రజలు కలిసి బాధ్యత తీసుకోవాల్సిన సమయం వచ్చింది. లేకపోతే రేపటి తరాలకు మిగిలేది ఎండిపోయిన నదీగర్భం, వ్యాధులతో నిండిన జీవితాలు మాత్రమే మీగులుతున్నాయి.

స్వర్ణాంధ్రలో సూపర్ స్టార్ కృష్ణ
## జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు సినీ పరిశ్రమలో కృష్ణ లాంటి మనసున్న హీరోనీ చూడలేమని ఆయన పేరున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మహేశ్ సేవా సమితి అభిమానులు అభినందనీయులని నగర జనసేన ఇన్చార్జి అతి సత్యనారాయణ ప్రశంసించారు ఆదివారం ఉదయం స్థానిక లాలాచెరువులో గల స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో జరిగిన సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ జయంతి వేడుకలు స్వర్ణాంధ్ర రాంబాబు తో కలిపి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన గేట్లు కట్ చేసి శీతల పానీయ బాటిల్స్ తో కలిపి వృద్ధులకు అందించారు. అలాగే వృద్ధులకు సత్యనారాయణ చేతుల మీదగా అన్నదానం చేశారు. సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ కృష్ణ మహేష్ బాబు సేవా సమితి కే ఎన్వి తనుజ్ మరియు మిత్ర బృందం ఘటమనేని వంశానికి వీరాభిమానులు అన్నారు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు సినిమా హీరో అభిమానులు అందరూ సామాజిక సేవలో పాల్గొనడం సూపర్ స్టార్ కృష్ణ దగ్గర నుంచే వచ్చిందన్నారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుత్తుల బుల్లి, ప్రసాద్, నాని, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణకు
## దరఖాస్తులు ఆహ్వానం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళలకు కుట్టుశిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాట్లు నిర్వాహకులు గుబ్బల రాంబాబు తెలిపారు. కుట్టు ,మగ్గం, బ్యూటిషన్ కోర్సులలో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రవేశం కోరగోరేవారు కనీసం ఏడవ తరగతి చదువుకుని ఉండాలన్నారు.జూన్ 2 మంగళవారం నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని శిక్షణా సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు.శిక్షణానంతరం ఉచితంగా సర్టిఫికెట్లు, జ్ఞాపికను బహుకరిస్తామని ఆసక్తి గల అభ్యర్థులు లాలాచెరువులో గల స్వర్ణాంధ్రను స్వయంగా గాని లేదా 9849847489 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు. స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు 20100 మంది కి ఉచితంగా శిక్షణ అందించామని సుమారు 505 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు బహుకరించామని రాంబాబు తెలిపారు.36 మంది తమ సంస్థ ద్వారా శిక్షణ పొంది ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ట్ టీచర్లుగా పనిచేస్తున్నారని కొన్ని వేల మంది స్వయం ఉపాధి పొందుతున్నారని అన్నారు.మహిళల స్వయం ఉపాధి కోసం ఈ శిక్షణను నిరంతరం కొనసాగిస్తున్నామని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు.

రానున్న స్థానిక ఎన్నికల్లో
## గ్రామ కమిటీలదే కీలక పాత్ర : జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో గ్రామకమిటీలే క్రియాశీలక పాత్ర పోషించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం మండలంలోని గరగలంపాలెం, కోటి, శ్రీరంగపట్నం, నిడిగట్లలో వైకాపాశ్రేణులతో గ్రామ కమిటీల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఇకనుంచి గ్రామాల్లో నిర్వహించే పార్టీ కార్యక్రమాలన్నీ గ్రామకమిటీలే బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. త్వరలో రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో సమర్థవంతమైన వ్యక్తిని పోటీలో నింపి, విజయానికి అన్ని గ్రామకమిటీలు, నాయకులు సమర్థ వంతంగా పనిచేసి విజయాన్ని చేజిక్కించుకోవలని పార్టీ శ్రేణులకు రాజా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చర్చిలు, దైవజనులపై దాడులు అమానుషం

ముక్తకంఠంతో గొంతెత్తిన దళిత సంఘాలు - మతం మారితే కులం మారుతుందా?
ట్రిబుల్ ఆర్‌కు తగిన గుణపాఠం చెబుతాం





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల ఆకివీడులో చర్చిల కూల్చివేత దైవజనులపై దాడులు చాలా అమానుషమని కోరుకొండ మండల దళితసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు చేపట్టాయి. ఆదివారం దళితసంఘల దైవజనులు, పార్టీలకు అతీతంగా దళిత నాయకులు, మహిళలు దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మండలంలోని జంబుపట్నం నుండి ప్రధాన రహదారిపై ఆర్టీసీ కాంప్లెక్స్ మీదగా కాపవరం వరకు భారీ ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపట్టి, చర్చిలు దైవజనులపై దాడులు అరికట్టాలి, క్రైస్తవుల ఐక్యత వర్ధిల్లాలి, మతం మారితే కులం మారుతుందా? ట్రిబుల్ ఆర్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు, దైవజనులు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం నివారించలేక పోతుందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దళితులకు అన్ని విధాలుగా అండదండగా ఉంటామని ఓట్లు వేయించుకున్న తర్వాత దళితులపై దాడులను ప్రభుత్వం ప్రోత్సహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మతం మారితే, కులం మారుతుందా? దళితులకు మత స్వేచ్ఛ హక్కు లేదా? అంటూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిబుల్ ఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ, డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతి దళితుడు పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఏకతాటిపైకి వచ్చే సమయం ఆసన్నమైందని, ఇప్పటికైనా దళితులంతా సంఘటితంగా లేకపోతే దళితుల ఉనికికే ముప్పు ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వంపై పోరాటానికి ఇది ప్రారంభం మాత్రమేనని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా దళితుల సత్తా చూపిస్తామన్నారు. జూన్ 5వ తేదీన సీతానగరం మండల జరిగే కార్యక్రమాన్ని దళితులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దైవజనులు కోణాల లాజర్, కోడె మోజెస్, చిర్ర ప్రసాద్, మట్టాడి లాజరస్, నక్కా ఆనంద్ కుమార్, కల్వరి కుమార్, పరంజ్యోతి, దళిత నాయకులు నక్కా రాంబాబు, పెట్టా కృష్ణ, గండి విజయ్ కుమార్, పండ అబ్బులు, గోల్లవిల్లి ప్రవీణ్, ఈతకట్టు చిన్నబాబు, బోల అబ్బులు, కంచుమర్తి దుర్గారావు, దళిత మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళ కడుపులో కణితిని
## తొలగించిన డాక్టర్ లక్ష్మి మృదుల




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేద హాస్పిటల్స్ మహిళా డాక్టర్ లక్ష్మీ మృదుల, ప్రముఖ గైనకాలజిస్ట్, ఒక మహిళ కడుపులో పెరిగిన రెండు కేజీల పైనే బరువన్న కనితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. విశాఖపట్నం సీతమ్మ దారకు చెందిన కే.అప్పలకొండ (45) కనితిని మోస్తూ రెండు సంవత్సరాలుగా బాధపడుతోంది. తోగమ్మిలో ఉంటున్న తన సోదరి ద్వారా అప్పలకొండ రాజమహేంద్రవరం వేద హాస్పటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీ మృదులని సంప్రదించారు అనంతరం అన్ని పరీక్షలు నిర్వహించి శాస్త్రచికిత్స చేసి కనితిని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మృదుల మాట్లాడుతూ కనితి తొలగించక ముందు ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఉండేదని, ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నారని తెలియజేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# యాక్టింగ్, ఫిట్‌నెస్‌కి కేరాఫ్ ఈ స్టార్ హీరో..!

## 60ఏళ్ల వయసులోనూ కుర్రాళ్లకు పోటీ



కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ సినిమాల్లో తన పాత్రల కోసం శరీరాన్ని మలుచుకునే విధానం చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. సుమారు 60 ఏళ్ల వయసులోనూ ఆయన చూపిస్తున్న ఫిట్‌నెస్ కుర్రాళ్లకు దీటుగా ఉంటోంది. ఆయన కేవలం నటుడు మాత్రమే కాదు, ఫిట్‌నెస్ విషయంలో ఒక రోల్ మోడల్. 'ఐ' చిత్రంలో మూడు భిన్నమైన పాత్రల కోసం ఆయన చేసిన శ్రమ, కఠినమైన వ్యాయామాలు ఎందరో యువకులకు స్ఫూర్తినిచ్చాయి. తాజాగా సోషల్ మీడియాలో ఆయన పంచుకున్న జిమ్ ఫొటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. విక్రమ్ ఎప్పుడూ ఒకే రకమైన వ్యాయామాలు చేయరు. తాను పోషించే ప్రతి పాత్రకు తగ్గట్టుగా తన దినచర్యను మార్చుకుంటారు. ముఖ్యంగా ప్లైయోమెట్రిక్ వ్యాయామాలు ఆయనకు అత్యంత ఇష్టం. ఇవి శరీరానికి వేగాన్ని, చురుకుదనాన్ని ఇవ్వడంతో పాటు కండరాల బలాన్ని పెంచుతాయి. బాడీబిల్డర్ పాత్ర కోసం భారీ వెయిట్‌లిఫ్టింగ్, ఒక సాధారణ పాత్ర కోసం కార్డియో వ్యాయామాలు.. ఇలా పాత్ర స్వభావాన్ని బట్టి వర్కౌట్ స్టైల్ మారుతుంటుంది. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఐ' చిత్రం కోసం 90 కిలోల నుంచి 52 కిలోలకు ఆయన తగ్గిన తీరు ఒక సంచలనం. అలాగే 'తంగలాన్' చిత్రంలో గిరిజన యోధుడి పాత్ర కోసం ఆయన పడిన శ్రమ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలనే తపనను చూపిస్తుంది.

**ఆహార నియమాలు..**

శరీరాకృతి అనేది కేవలం వ్యాయామంపైనే కాకుండా, తీసుకునే ఆహారంపై కూడా ఆధారపడి ఉంటుందని విక్రమ్ బలంగా నమ్ముతారు. బరువు తగ్గాలనుకున్నప్పుడు ఫైబర్ అధికంగా ఉండే కూరగాయలు, పండ్లను ఎక్కువగా తీసుకుంటారు. కార్బోహైడ్రేట్లను తగ్గించి, గుడ్డు తెల్లసొన, ఉడికించిన చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ రిచ్ డైట్‌ను క్రమం తప్పకుండా పాటిస్తారు. షూటింగ్ సమయంలో ఆయన తన ఆహార విషయంలో అత్యంత కఠినంగా ఉంటారు.

**అసాధ్యాలను సుసాధ్యం చేసి..**

విక్రమ్ శారీరక పరివర్తన వెనుక ఒక విషాదకరమైన కానీ స్ఫూర్తిదాయకమైన కథ ఉంది. కళాశాల రోజుల్లో జరిగిన ఒక ఘోర ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మళ్లీ నడవలేరని వైద్యులు చెప్పినా, కాలు తొలగించాల్సిన పరిస్థితి వచ్చినా ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. ఎన్నో శస్త్రచికిత్సలు, సుదీర్ఘ విశ్రాంతి తర్వాత ఊతకర్రల సాయంతో మొదలైన ఆయన ప్రయాణం, ఈరోజు తమిళ చిత్రసీమలో అత్యంత కష్టపడి పనిచేసే నటుడిగా నిలబెట్టింది. ఆనాటి పోరాటమే ఆయనలోని సంకల్ప బలాన్ని రెట్టింపు చేసింది. కష్టం, క్రమశిక్షణ ఉంటే వయసుతో సంబంధం లేకుండా ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని చియాన్ విక్రమ్ నిరూపిస్తున్నారు. ఆయన ఫిట్‌నెస్ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఒక పాఠం.

# ఆ ఒక్క సీన్‌తో సెన్సేషన్ అయ్యింది..

## చేసిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్.. అయినా తగ్గని డిమాండ్..



కేవలం ఒకే ఒక్క సెకను వీడియో క్లిప్‌తో దేశవ్యాప్తంగా విపరీతమైన పాపులారిటీ తెచ్చుకున్న ఈ కేరళ కుట్టి, ఆ క్రేజ్‌ను సక్సెస్‌ఫుల్ కెరీర్‌గా మార్చుకోవడానికి ఇప్పటికీ గట్టిగానే పోరాడుతోంది. ఇప్పటివరకు ఆమె నటించిన చిత్రాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. దీంతో సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తున్న ఈ అమ్మడు నెట్టింట గ్లామరస్ ఫొటోలతో రచ్చ చేస్తుంది. సినిమా ఇండస్ట్రీలో ఒక నటి గుర్తింపు తెచ్చుకోవడానికి ఏళ్ల తరబడి కష్టపడాలి. కానీ, మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ పరిస్థితి అందుకు భిన్నం. కేవలం ఒక చిన్న కన్నుగీటుతో దేశవ్యాప్తంగా యువత గుండెల్లో అలజడి సృష్టించి, రాత్రికి రాత్రే 'నేషనల్ క్రష్'గా పేరుగాంచింది. 'ఒరు ఆధార్ లవ్' చిత్రంలోని "మాణిక్య మలరాయ పూవి" పాటలో ఆమె పలికించిన హావభావాలు సోషల్ మీడియాలో సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. ఒక్క వీడియో క్లిప్‌తో వచ్చిన క్రేజ్ ఊహించని స్థాయిలో పెరిగినా, సినిమాల విషయంలో మాత్రం ఆమెకు సవాళ్లు ఎదురయ్యాయి. ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేదు. తెలుగులో నితిన్ సరసన 'చెక్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, టాలీవుడ్‌లో తనకంటూ ఒక స్థానం కోసం ప్రయత్నించింది. అయితే, ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో ఆమెకు ఆశించిన బ్రేక్ దక్కలేదు. అనంతరం పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ నటించిన 'బ్రో' చిత్రంలో కీలక పాత్రలో కనిపించినా, కథానాయికగా తనదైన ముద్ర వేయడానికి ఇంకా సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉంది. సినిమాల్లో విజయాల శాతం తక్కువగా ఉన్నప్పటికీ, గ్లామర్ , ఫ్యాషన్ ప్రపంచంలో ప్రియాకు తిరుగులేదు. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న భారీ ఫాలోయింగ్‌ను ఏ ఇతర నటి అందుకోవడం కష్టమే. తరచూ తన గ్లామరస్ ఫోటోషూట్‌లు, ట్రెండీ వీడియోలతో అభిమానులను ఎప్పుడూ టచ్‌లో ఉంచుకుంటుంది. అందం, స్టైల్ , ఫ్యాషన్ సెన్స్‌తో యువతను నిరంతరం ఆకట్టుకోవడంలో ఆమె సక్సెస్ అవుతోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి. ప్రస్తుతం ప్రియా ప్రకాష్ వారియర్ దక్షిణాది సినీ పరిశ్రమలో తన ఉనికిని చాటుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఇటీవల అజిత్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంతో పాటు ధనుష్ దర్శకత్వంలో వచ్చిన 'నిలవుకు ఎన్ మేల్ ఎన్నడి కోపమ్' వంటి సినిమాల్లో నటిస్తూ తన కెరీర్‌ను గాడిలో పెట్టుకుంటోంది. తెలుగు, తమిళం, మలయాళంలో సరైన ఛాన్స్ కోసం చూస్తుంది. టాలీవుడ్‌లో ఇప్పటివరకు పెద్ద విజయం ఆమెను వరించకపోయినా, ఆమెకున్న ఫాలోయింగ్ , నటనపై ఆమెకు ఉన్న ఆసక్తిని చూస్తుంటే.. సరైన కథ, పవర్ ఫుల్ పాత్ర లభిస్తే మళ్లీ ప్రియా తన సత్తా చాటడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ 'వింక్ సెన్సేషన్' భవిష్యత్తులో ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి!

### సెంటిమెంటే కాదు, రికార్డులు బ్రేక్..

# వరుసగా 2వసారి ఐపీఎల్ విజేతగా బెంగళూరు..




ఐపీఎల్ క్రికెట్ సామ్రాజ్యాన్ని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరోసారి తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన తుది పోరులో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపించి వరుసగా రెండో ఏడాది కూడా విజేతగా నిలిచింది. దీంతో బెంగళూరు అభిమానుల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ బ్యాక్ టు బ్యాక్ ట్రోఫీలతో సరికొత్త చరిత్ర సృష్టించింది. మైదానం మొత్తం ఆర్సీబీ నామస్మరణతో మార్మోగిపోతోంది. ఈ ప్రతిష్టాత్మక తుది పోరులో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. బెంగళూరు బౌలర్లు మొదటి ఓవర్ నుంచే గుజరాత్ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. ఖచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు విసురుతూ ప్రత్యర్థి జట్టుకు ఎక్కడా కోలుకునే అవకాశం ఇవ్వలేదు. గుజరాత్ బ్యాటర్లు ఎంత శ్రమించినా భారీ భాగస్వామ్యాలు నెలకొల్పలేకపోయారు. దీంతో బెంగళూరు ముందు ఒక మోస్తరు లక్ష్యం మాత్రమే నమోదైంది.

**మైదానంలో పరుగుల తుఫాన్.. ఆర్సీబీ విశ్వరూపం**

గుజరాత్ నిర్దేశించిన 156 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇన్నింగ్స్ ఆరంభం నుంచే వీరవిహారం చేసింది. విరాట్ కోహ్లీ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. మైదానంలో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించడంతో స్టేడియం మొత్తం హోరెత్తిపోయింది. ఆర్సీబీ కేవలం 18 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది. గుజరాత్ బౌలర్లు ఎంతలా ప్రయత్నించినా బెంగళూరు బ్యాటర్ల జోరును అడ్డుకోలేకపోయారు.

**ఐదు వికెట్ల తేడాతో అద్భుత విజయం..**

ఈ చారిత్రాత్మక విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఏకంగా 5 వికెట్ల తేడాతో గుజరాత్‌పై పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇంకా రెండు ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేధించి తమ సత్తా ఏంటో నిరూపించింది. గతంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న ఈ జట్టు, ఇప్పుడు వరుసగా రెండు సీజన్లలో కప్పును ముద్దాడి విమర్శకుల నోళ్లు మూయించింది. 'ఈసాలా కప్ నమ్దే' అనే నినాదం కాస్త, ఇప్పుడు 'ఈసాలా కప్ నమ్దే సీజన్ 2' గా మారి బెంగళూరు అభిమానులకు అంతకు మించిన ఆనందాన్ని ఇస్తోంది. మొత్తానికి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణించి మరోసారి ఐపీఎల్ పీఠాన్ని అధిరోహించింది. విరాట్ కోహ్లీ సారథ్యంలోని లైనప్ ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని ఈ విజయాన్ని సాధించింది. ఈ అద్భుతమైన విజయం ఆర్సీబీ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆరెంజ్ క్యాప్ విజేతగా బాస్ బేబీ..



రాజస్థాన్ రాయల్స్ జట్టు టైటిల్ గెలవలేకపోయినా, ఈ సీజన్ ద్వారా భారత క్రికెట్‌కు ఒక అద్భుతమైన వజ్రం దొరికింది. చిన్న వయసులోనే కొండంత ఆత్మవిశ్వాసంతో అంతర్జాతీయ బౌలర్లను ఎదుర్కొన్న వైభవ్ సూర్యవంశీ, రాబోయే రోజుల్లో ప్రపంచ క్రికెట్‌ను శాసించడం ఖాయంగా కనిపిస్తోంది. క్రికెట్ ప్రేమికుల గుండెల్లో ఈ 15 ఏళ్ల కుర్రాడు చెరిపివేయలేని ముద్ర వేశాడు. భారత క్రికెట్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం లిఖించబడింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐపీఎల్ 2026 టోర్నీలో కేవలం పదిహేనేళ్ల ప్రాయంలోనే ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ పరుగుల వరద పారించి ప్రతిష్టాత్మక 'ఆరెంజ్ క్యాప్' కైవసం చేసుకున్నాడు. క్రికెట్ దిగ్గజాలకే సాధ్యం కాని రికార్డును ఈ చిన్నారి సంచలనం సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఆరెంజ్ క్యాప్ విజేత రూ. 10 లక్షల ప్రైజ్ మనీ అందించనున్నారు.

**ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన పరుగుల వేట..**

ఐపీఎల్ అంటేనే అనుభవం, ఒత్తిడిని తట్టుకునే సత్తా ఉన్న ఆటగాళ్ల వేదిక. అలాంటి చోట 15 ఏళ్ల వయసున్న వైభవ్ సూర్యవంశీ మైదానంలో అడుగుపెట్టి బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ ప్రయాణం క్వాలిఫైయర్-2 లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ముగిసినప్పటికీ, వైభవ్ సృష్టించిన పరుగుల సునామీ మాత్రం క్రికెట్ ప్రపంచాన్ని అబ్బురపరిచింది. టోర్నీ అంతటా అద్భుతమైన స్థిరత్వం, భయం లేని బ్యాటింగ్ శైలితో ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన వీరుడిగా అగ్రస్థానంలో నిలిచాడు.

**రికార్డుల రారాజు.. విధ్వంసకర బ్యాటింగ్..**

ఈ సీజన్ లో వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన చరిత్ర పుటల్లో నిలిచిపోతుంది. ఆడిన 16 మ్యాచుల్లో ఏకంగా 776 పరుగులు సాధించాడు. ఇందులో అతడి సగటు 48.50 కాగా, స్ట్రైక్ రేట్ 237.30 గా నమోదవడం విశేషం. లీగ్ దశలోనే కాకుండా అత్యంత ఒత్తిడి ఉండే ప్లేఆఫ్స్ మ్యాచుల్లోనూ ఈ కుర్రాడు రెచ్చిపోయాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 12 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 97 పరుగులు చేసి ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన, విధ్వంసకర ఇన్నింగ్స్‌లలో ఒకదాన్ని నమోదు చేశాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com